ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 15, మార్చి 2025



విద్యుత్ కాంతులతో శింగరకొండ ఆలయ రాజగోపురం



శింగరకొండ తిరునాళ్లలో క్షేత్రం వద్ద విద్యుత్ వెలుగులు

వైభవంగా శింగరకొండ తిరునాళ్ల
కొండంత 'ప్రభ'

శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల వైభవంగా జరిగింది. లక్ష్మీనరసింహ, ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల చివరి రోజు శుక్రవారం శింగరకొండ క్షేత్రం విద్యుత్ వెలుగులతో ధగధగలాడింది. తిరునాళ్లలో 5 విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయం వద్ద రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవాన్ని తిలకించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

4

మీరు ఊ.. అంటే జడ్పీ నుంచి పంపేస్తా..

- నాతో సహా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలందరిపై విచారణ జరపాలి
- చంద్రబాబు, పవన్ సంయుక్తంగా కేడర్‌కు భరోసా ఇవ్వాలి
- జనసేన సభలో జగన్‌పై నిప్పులు చెరిగిన బాలినేని



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'మీరు(పవన్) ఊ అంటే ప్రకాశం జిల్లా పరిషత్ పాలకమండలి నుంచి కూడా వైసీపీని తరిమేస్తాం' అని బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యాలు చర్చనీయాంశమయ్యాయి. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై మరోసారి నిప్పులు చెరిగిన మాజీ మంత్రి జిల్లాకు సంబంధించి రాజకీయంగా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి జనసేనలో చేరిన బాలినేని శుక్రవారం పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. జిల్లా సమస్యలను ఆయన ప్రస్తావిస్తూ ఒంగోలులో కార్పొరేషన్‌లో 20 మంది వైసీపీ కార్పొరేటర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు జనసేనలో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్ ఓకే అంటే జిల్లా పరిషత్‌పై పెత్తనం చేస్తున్న వైసీపీ చైర్‌పర్సన్‌ను కూడా గద్దె దించుతామని స్పష్టం చేశారు. కొద్దిరోజుల క్రితం మంగళగిరిలో పవన్‌ను కలిసిన బాలినేని జిల్లాలో ఆయా నియోజకవర్గాల వారీ స్థానిక సంస్థలను కూటమి పార్టీలు కైవసం చేసుకునే విధంగా వైసీపీ నుంచి జనసేనలో చేరే వారి విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్‌ల పాలకమండలి కాలపరిమితి నాలుగేళ్లు పూర్తికావడంతో వారిని అవిశ్వాస తీర్మానంతో తొలగించే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో బాలినేని తన ప్రసంగంలో జడ్పీ చైర్‌పర్సన్‌ను తొలగిస్తామని, జనసేన (కూటమి) పరిధిలోకి తెస్తామని అనడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో బాలినేని వ్యాఖ్యలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి.

బడా నేతలపై దృష్టిపెట్టాలి

బాలినేని వైసీపీ అధినేత జగన్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. అప్పటి ఎంపీ రఘురామకృష్ణమరాజును కొట్టించి నానాహింసలు పెట్టిన జగన్ నేడు వంశీ, పోసాని కృష్ణమురళీలను అరెస్టు చేస్తే పరామర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సాదాసీదా కార్యకర్తలను అరెస్టు చేయడం పక్కనబెట్టి వైసీపీ ప్రభుత్వంలో అవినీతితో కోట్లు సంపాదించిన బడా నేతలపై దృష్టిపెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తనతోపాటు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పాలనపై విచారణ జరపాలని కోరారు. తాను

మిగతా 4లో...

కనిగిరి నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రం నుంచి పలు గ్రామాలు 50 నుంచి 70 కి.మీ. దూరంలో ఉన్నాయి. అయినా కనిగిరి హెడ్ క్వార్టర్‌లో ఫైర్ స్టేషన్ ఉండగా అక్కడ కూడా ఒకే ఒక్క వాహనం ఉంది. సిబ్బంది కొరత ఉండగా పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఒకేసారి రెండు ప్రాంతాల్లో ప్రమాదం జరిగితే కనిగిరిలో ఉన్న ఒక్క వాహనాన్ని ఎటు పంపాలో అర్థం కాని పరిస్థితి.

ఒంగోలులోని ఫైర్ స్టేషన్‌లో రెండు అగ్నిమాపక వాహనాలు, ఒక రెస్క్యూ వాహనంతోపాటు నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఇక్కడ సిబ్బంది కొరత వేధిస్తోంది. 25 మంది ఉండాల్సి ఉంటే 15 మంది మాత్రమే ఉన్నారు. వారు రెండు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు ఇతర విపత్తుల సమయంలో సిబ్బంది సరిపోక ఇబ్బందిపడుతున్నారు.

ఇదీ జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల దుస్థితి. అన్నిచోట్లా ఫైర్ స్టేషన్లలో సమస్యలు తిష్ట వేశాయి. సాధారణంగా వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. తదనుగుణంగా అగ్ని ప్రమాదాలు అధికంగానే జరుగుతుంటాయి. పొగాకు బ్యారన్లు, దుకాణాలు, వాణిజ్య సంస్థలలో పలు కారణాలతో తరుచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో అగ్నిమాపక శాఖలను మరింతగా విస్తరింపజేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అరకొర సేవలే అందుతున్నాయి. శుక్రవారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో ఇలాంటి అనేక అంశాలు వెలుగులోకొచ్చాయి.

అగ్గి రేగితే బుగ్గే

అరకొరగా అగ్ని మాపక సేవలు

- పాత వాహనాలు, సిబ్బంది కొరత
- కీలక ప్రాంతాల్లోనూ ఒక్క వాహనమే గతి
- సుదూర పరిధి వెళ్లేలోపు అగ్నికి ఆహుతి
- ఐదేళ్లుగా పొదిలిలో నిర్మాణం కాని వైనం
- దోర్నాల వాహనం రేపల్లెకి తరలింపుతో తిప్పలు

ఒంగోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంటలు చెలరేగితే ఆర్పే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాకేంద్రమైన ఒంగోలుతోపాటు మార్కాపురం, కనిగిరి, దర్శి, కొండపి, గిద్దలూరు, కంభం, వైపాలెం, దోర్నాల, టంగుటూరు వంటి చోట్ల ఫైర్ స్టేషన్లు ఉండగా కొన్నింటిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మరికొన్ని చోట్ల పాత వాహనాలతో వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు చాలాచోట్ల పరిధి ఎక్కువగా ఉండి ప్రమాదం జరిగిన సమయంలో సకాలంలో వాహనాలు అక్కడికి చేరని పరిస్థితి ఎదురై నష్టం జరిగిపోతోంది. కొత్త స్టేషన్ల ఏర్పాటును ఎవరు పట్టించుకోవడం లేదు. కీలకమైన పొదిలి పట్టణంలో ఐదేళ్ల క్రితం మంజూరైన ఫైర్‌స్టేషన్ ఇంతవరకు నిర్మాణానికి నోచుకోలేదు. దోర్నాలలో ఉన్న వాహనాన్ని ఉన్నతాధి కారులు రేపల్లెకు పంపించడంతో అక్కడ అగ్నిమాపక కేంద్రం ఖాళీగా దర్శనమిస్తోంది. వేసవి సీజన్ సమీపించిన వేళ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ అరకొర సేవలు తప్ప పూర్తిస్థాయిలో ఆయా స్టేషన్లు

మిగతా 4లో...



ఒంగోలులోని అగ్నిమాపక కేంద్రం

దోర్నాల వాహనం రేపల్లెకు..

నల్లమల అటవీప్రాంతంలో తరుచూ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలతోపాటు శ్రీశైలం ముఖద్వారంగా ఉండే దోర్నాలలో ఫైర్ స్టేషన్ ఉంది. ఇక్కడ ఉన్న వాహనాన్ని రెండు నెలల క్రితం బాపట్ల జిల్లా రేపల్లెకు ఉన్నతాధికారులు పంపించి వేశారు. దీంతో ప్రస్తుతం దోర్నాలలో వాహనం లేకుండా స్టేషన్ దర్శనమిస్తోంది. సిబ్బంది కూడా ఇద్దరు, ముగ్గురు లెక్కకు ఉండగా మిగతా వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ప్రమాదం సంభవిస్తే దూరంగా ఉండే మార్కాపురం, వైపాలెం నుంచి వాహనాలు వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం వైపాలెంలో వాహనం, సిబ్బంది ఉన్నా పరిధి ఎక్కువగా ఉండటం ఇబ్బందికరంగా ఉంది. ఈ నెలలో ఇప్పటికే ఆ స్టేషన్ పరిధిలో ఏడు ప్రమాదాలు జరగడం ఆ ప్రాంతంలో పరిస్థితిని పట్టి చూపుతోంది.

ఆంధ్రజ్యోతి విజిట్

వేధిస్తున్న సమస్యలు

కొండపిలోని ఫైర్ స్టేషన్‌లో ఒక వాహనం ఉండగా చిన్నపాటి మరమ్మతులు తప్ప పెద్దగా ఇబ్బంది లేదు. ఇక్కడ 17మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 11 మంది మాత్రమే ఉన్నారు. దర్శి స్టేషన్‌లో వాహనం, సౌకర్యాలు అందుబాటులోనే ఉండగా కంభంలో మూడు మండలాల పరిధితో స్టేషన్ ఉంది. అక్కడ 20ఏళ్ల పైబడిన వాహనం ఉండటంతో తరుచూ మరమ్మతులు చేయాల్సి వచ్చి మొరాయిస్తోంది. సకాలంలో అవసరమైన చోటకు వాహనం వెళ్లే పరిస్థితి లేదు. గిద్దలూరు ఫైర్ స్టేషన్‌లో కూడా ఒకే ఒక్క వాహనం ఉంది. అది కూడా 12ఏళ్ల క్రితం నాటిది. సిబ్బంది కొరత కూడా ఉంది. తరుచూ ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. కొమరోలులో ఫైర్‌స్టేషన్ కోసం మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు.



ఒంగోలులో హోలీ సంబరంలో చిన్నారులు

ఒంగోలులో యువకుల కేరింతలు

5

జాలీగా హోలీ!

నింగిలోని హరివిల్లు నేలకి దిగినట్టూ.. ఊళ్లన్నీ వసంతమాడినట్టూ జిల్లాలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పిల్లలూ, పెద్దలూ ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకున్నారు. యువతీ యువకులు రంగులు పులుముకుంటూ ఆనందడోలికల్లో మునిగితేలారు. ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయంగా సాగాలని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి
- ప్రకాశం భవనంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం ఎస్సీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మానవతా వాది, ప్రపంచ మేధావి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. ఏ సదుపాయాలు లేని రోజుల్లోనే విదేశీ విద్యను అభ్యసించి అందరి మన్ననలు పొందడం వారి బహుముఖ ప్రతిభకు నిదర్శనమని మంత్రి అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరికం లేని సమాజం కోసం కృషిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాల్లో, గురుకుల పాఠశాలలో సంస్కరణలతోపాటు వసతులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా

మిగతా 4లో...



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత తదితరులు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 183 పరీక్షా కేంద్రాలు
- 29,602 మంది విద్యార్థులు
- 9 ఫ్లయింగ్ స్క్వాడ్లు

5

కల్యాణం కమనీయం

వైభవంగా ముగిసిన పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.




జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్సుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..




పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పండ్ల వ్యాపారిపై పోలీసు అధికారి జులుం

- ఆగ్రహంతో కత్తి దూసిన వ్యాపారి
- పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- రోడ్డు పక్కన పండ్ల దుకాణాల తొలగింపు

ఒంగోలు క్రైం, మార్చి14(ఆంధ్రజ్యోతి): అతను ఓ పోలీస్ అధికారి..ట్రాఫిక్ నియంత్రణలో కీలక అధికారి.. ఆయనకు కోపం వచ్చింది. దీంతో రమారమి 50 కుటుంబాల జీవనాధారాన్ని కోల్పోయారు. వారంతా బజారు నపడ్డారు. రోజు వ్యవధిలో అమ్ముకోవాల్సిన పండ్లు, ఇతర పచ్చి కూరగాయలన్నీ నేలపాలై భారీగా నష్టపోయారు. దీనంతటికీ ఆ అధికారి సివిల్ డ్రెస్‌లో ఉండడం, అతన్ని పోలీస్ అధికారి అని గుర్తించలేక ఓ పోలీస్ అధికారి అని గౌరవం ఇవ్వక పోవడం., తద్వారా సదరు అధికారి తన కుటుంబ సభ్యులు ముందు తన పరువు పోయిందన్న బాధతో అహంతో వ్యవహరించడమే కారణం. ఆయన అక్కడ్నుంచి సందేశం పంపగానే ఒంగోలు నగరంలో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న పోలీసులందరూ పరుగు పరుగున అక్కడకు చేరారు. ముందస్తు హెచ్చరికలు, నోటీసులు లేకుండా మొత్తం పండ్లు, కూరగాయలు అమ్ముకునే షాపులన్నింటినీ తొలగించారు. ఫలితంగా ఆ వ్యాపారులందరూ భారీగా నష్టపోయారు. ఈ సంఘటన ఒంగోలు నగర పరిధిలోని మంగమ్మకాలేజీ సర్కిల్ దాటాక రోడ్డు పక్కన పండ్లు, కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు ఉన్న ప్రాంతంలో చోటుచేసుకుంది. ఒంగోలులో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి తన కుటుంబసభ్యులతో కారులో త్రోవగుంట వైపు వెళుతున్నారు. ఈక్రమంలో వ్యవసాయ మార్కెట్ వద్ద రోడ్డు పక్కన పండ్ల దుకాణం వద్ద ఓ కారు ఆగి ఉంది. అందులోని వారు పండ్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే దారికి అడ్డుగా కారు ఉండటంతో పోలీసు అధికారి తన కారు ఆపిన హారన్ కొట్టారు. ఆయన సాధారణ దుస్తుల్లో ఉండటంతో పండ్ల వ్యాపారి కలుగ జేసుకుని పక్కకు తొలగి వెళ్లవచ్చుగా అని సలహా ఇచ్చాడు. దీంతో పోలీసు అధికారికి కోపం వచ్చి కారు దిగి అక్కడ ఉన్న పండ్ల బుట్టలను కాలుతో తన్నారు. వెంటనే వ్యాపారికి కోపం కట్టలు తెంచుకుని తన వద్ద ఉన్న బుట్టలోని కత్తి తీసి కారుపై దాడి చేశాడు. అప్పటికీ తాను ఫలానా పోలీసు అధికారిని అని కూడా చెప్పలేదు. అనంతరం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని కత్తితో దాడికి పాల్పడిన వ్యాపారిని తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో రోడ్డుకు ఇరువక్కల ఉన్న పండ్ల దుకాణాలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. రోడ్లపై వ్యాపారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అయితే దీనిపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. కాగా ఈ విషయమై నగరట్రాఫిక్ సీఐ పాండురంగారావును ప్రశ్నించగా అక్కడ పండ్ల దుకాణాల వ్యాపారులు రోడ్డు పైకి వచ్చి వాహనాలను ఆపుతూ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారని చెప్పారు. తదనుగుణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న షాపులను తొలగించేందుకు గతంలోనే సమాచారం ఇచ్చామని, అందులో భాగంగానే తొలగించాం తప్ప, ఇతరత్రా అంశాలు కారణం కాదని చెప్పారు.


దుకాణాలు ఖాళీ చేస్తున్న రోడ్డు పక్కన కాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు

వైభవంగా శింగరకొండ తిరునాళ్ల

అద్దంకి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల వైభవంగా సాగింది. లక్ష్మీనరసింహ, ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం ప్రారంభమై మూడు రోజులపాటు సాగాయి. శుక్రవారం ప్రధాన తిరునాళ్లతో ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు శుక్రవారం శింగరకొండ క్షేత్రం కొండంత వెలుగులతో నిండిపోయింది. ప్రసన్నాంజనేయ, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలతో పాటు శింగరకొండ క్షేత్రం అంతా విద్యుత్ దీపాల వెలుగులతో వెలుగొందింది.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వద్ద శుక్రవారం రాత్రి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవాన్ని తిలకించారు. తిరునాళ్లకు 5 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభల వెలుగులు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శింగరకొండపాలెంకు చెందిరు టీడీపీ నేతలు రెండు విద్యుత్ ప్రభలు, అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఒకటి, టీడీపీ నేత సందిరెడ్డి రమేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఇక సందిరెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో 25వ సంవత్సరం విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నికల కోడ్, కొవిడ్ సమయంలో మినహా ఏటా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. కేవలం టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలే ఉండడంతో శింగరకొండక్షేత్రం అంతా పసుపుమయంగా మారింది. భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వద్దకు బీసీవై అధ్యక్షుడు రామచంద్రయాదవ్ హాజరై కార్యకర్తలను ఉత్సాహపరిచారు. తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు

ముఖం చాటేసిన వైసీపీ నేతలు

తిరునాళ్లకు వైసీపీ నేతలు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయకుండా ముఖం చాటేయడంతో వైసీపీ కార్యకర్తలు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. ఏటా పలు గ్రామాల నుంచి పోటాపోటీగా ఇరు పార్టీల నేతలు విద్యుత్ ప్రభల ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది అలా కాకుండి వైసీపీ నేతలు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయకుండా వెనుకడుగు వేయటం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని ఆదాయ వనరులను సొంతం చేసుకునేందుకు ముందున్న పలు గ్రామాల నేతలు అధికారం చేజారటంతో ముఖం చాటేయటం ఏమిటని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

అగ్గి రేగితే బుగ్గే

(3వ పేజీ తరువాయి)

ప్రజలకు ఉపకరించే పరిస్థితి కనిపించడం లేదు

పరిధి అధికం.. ఒకటే వాహనం

పశ్చిమ ప్రాంతంలో కీలకమైన మార్కాపురంలో సిబ్బంది, నీటి వసతి ఉన్నా అక్కడ ఒక్క వాహనం మాత్రమే ఉంది. అయితే ఈ స్టేషన్ పరిధి అధికంగా ఉండటం ఇబ్బందికరంగా మారింది. దానిని గుర్తించి ఒంగోలు- మార్కాపురం మధ్యలో కీలక పట్టణంగా ఉన్న పొదిలికి ఫైర్ స్టేషన్‌ను ఐదేళ్ల క్రితం మంజూరు చేసినా నిర్మాణం జరగలేదు. కంభాలపాడు వద్ద 1.50 ఎకరాల స్థలం ప్రతిపాదించి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేసినా స్థల సమస్య పరిష్కారం కాక నిలిచిపోయింది.

పేదల సంక్షేమానికి పెద్దపీట

(3వ పేజీ తరువాయి)

సన్నబియ్యం సరఫరా చేస్తామని వివరించారు. అన్ని గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడంతోపాటు, ఆ మహనీయుని చరిత్రను తెలియజేసేలా క్లుప్తంగా పుస్తకాలు అందజేస్తామన్నారు. అట్రాసిటీ కేసుల బాధితులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నటువంటి నిధులను రూ.40కోట్లు విడుదల చేశామని, ఇంకా రూ.20కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. మే నాటికి పూర్తిగా మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘాలకు అభినందనలు తెలిపారు. నేడు రాజ్యాంగం అమలు జరుగుతుందంటే ఆ గొప్పతనం ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి మహనీయుని ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యోగులు, దళిత సంఘాలు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఆర్వో మురళీ, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఆర్‌ఐవో సైమన్ విక్టర్, ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈదర విజయ్‌భాను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సునీల్, జిల్లా అధ్యక్షులు జూపల్లి రాజు, ఎన్జీవో సంఘం అధ్యక్షులు కూచిపూడి శరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు అవమానం

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన శిలాఫలకంపై ఎమ్మెల్యే బీఎన్ పేరు మరిచిపోవడంతో అందరు విస్మయానికి గురయ్యారు. స్థానిక వైసీపీ కార్పొరేటర్ పేరు ఇచ్చిన విగ్రహ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే పేరు ఇవ్వలేదు. దీంతో విషయాన్ని గమనించిన బీఎన్ విగ్రహానికి పూలదండ వేసి, సభావేదికపైకి రాకుండానే వెళ్లిపోయారు. అయితే బీఎన్ పేరును పెట్టకపోవడంపై కొందరు దళితసంఘాల నాయకులు, ఎస్ఎన్‌పాడు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించారంటూ ఆందోళన చేయడంతోపాటు మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే శిలాఫలకం మార్చాలని, ఎమ్మెల్యే బీఎన్ పేరును చేర్చి గౌరవించాలని సూచించారు.


రెండు గ్రామాల్లోని ఆలయాల్లో చోరీ

- హుండీలు పగులగొట్టి నగదు అపహరణ
- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం తనిఖీలు

ముండ్లమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక, బొప్పూడివారిపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఆభరణాలు, హుండీలు పగులగొట్టి నగదును అపహరించుకుపోయారు. జమ్మలమడకలోని శ్రీదుర్గా చెన్నమల్లేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయాల వద్ద ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. తాళాలు పగులగొట్టి ఆలయాల్లోకి చొరబడి హుండీలు పగులగొట్టి నగదుతో పాటు అమ్మవారి ఆలయంలో ఆభరణాలు అపహరించారు. ఉదయం 6 గంటలకు ఆలయాన్ని శుభ్రం చేసే మహిళ వినుకొండ నాగమణి వచ్చి చూడగా చెన్నమల్లేశ్వర స్వామి ఆలయం తాళాలు పగులగొట్టి ఉండటంతో పూజారి కృష్ణప్రసాద్‌కు తెలిపారు. దీంతో ఆయనతోపాటు గ్రామస్థులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అమ్మవారి మంగళసూత్రాలతో పాటు కల్యాణం చేసే సమయంలో అలంకరణ వస్తువులు, అమ్మవారి మెట్టెలు, వెండి పాదాలు, అరకిలో వెండి, ఇత్తడి ఆభరణాలు, భుజ కీర్తలు, అమ్మవారి కుడి, ఎడమ చేయి అలంకరణలు, అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రం, బంగారు ముక్కు పుడకలు, హుండీలో ఉన్న రూ.40వేల నగదు అపహరించారు. అదే గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో హుండీ పగులగొట్టి రూ.10వేలు అపహరించుకు పోయినట్టు పూజారి తెలిపారు. దర్శి సీఐ వై.రామారావు, ముండ్లమూరు, తాళ్ళూరు ఎస్‌ఐలు వై.నాగరాజు, ఎస్. మల్లికార్జునరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు క్లూస్ టీమ్ ఎస్‌ఐ శరత్ ఆధ్వర్యంలో వేలి ముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ కూడా పలు వీధుల్లో తిరిగింది. రెండు దేవాలయాల్లో రూ.5 లక్షలకు పైగానే వస్తువులు, నగదు అపహరణకు గురయ్యాయని పూజారి కృష్ణప్రసాద్ పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అలాగే బొప్పూడివారిపాలెంలోని పోలేరమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి రెండు హుండీల్లో నగదును అపహరించారు. అదేగ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా తాళాలు పగుల గొట్టారు. పోలేరమ్మ ఆలయంలోని రెండు హుండీల్లో రూ.50 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఒకేరోజు నాలుగు దేవాలయాల్లో చోరీలకు పాల్పడటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


పూజారిని విచారిస్తున్న పోలీసులు


జమ్మలమడకలో శ్రీదుర్గాచెన్నమల్లేశ్వర స్వామి దేవస్థాన తలుపులు పగులగొట్టిన దుండగులు , పక్కన పగులకొట్టిన హుండీ

మీరు ఊ.. అంటే జడ్పీ నుంచి పంపేస్తా..

(3వ పేజీ తరువాయి)

జనసేనలో చేరితే కూటమి పార్టీల మధ్య విభేదాలు వస్తాయని కొందరు ప్రచారం చేశారని, తాను పదవుల కోసం చేరలేదని అన్నారు. పవన్‌ను తనతో సినిమా తీసే అవకాశం మాత్రమే ఇవ్వాలని అడిగానని, తన ద్వారా కూటమి పార్టీల మధ్య విభేదాలు వచ్చే అవకాశం లేకుండా పనిచేస్తానని చెప్పారు. జగన్ చేసిన పాపాల ఫలితమే ఆయన్ను వెంటాడుతున్నాయని గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలు సరైన గుర్తింపు లేక ఇబ్బందిపడుతున్నారని, ఈ విషయమై చంద్రబాబు, పవన్‌లు సంయుక్తంగా సమావేశం పెట్టి ఇబ్బందులు కల్పిస్తున్న ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తూ కార్యకర్తలకు అండగా సంయుక్త ప్రకటన చేయాలని కోరారు.

కల్యాణం కమనీయం

● వైభవంగా పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు





మర్రిపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోవ రోజైన శుక్రవారం రాత్రి లక్ష్మీ స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. లక్ష్మీనరసింహుడు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పెళ్లికుమార్తె, పెళ్లికుమారుడిగా అలంకరించి దేవాలయ మాడవీధుల్లో ఊరేగించారు. లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులను వాసవి అన్నసత్ర సముదాయం వరకు తీసుకొచ్చి ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. అర్చకులు స్వామివార్లకు పుష్పమాల వేసే ప్రక్రియ భక్తులను పరవశింప చేసింది.

స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే నిత్య హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

పృథులగిరి రోడ్డు అభివృద్ధికి కృషి : దామచర్ల

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరిని చేరుకునేందుకు అవసరమైన ఘాట్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. శుక్రవారం ఆయన లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి అటవీ అనుమతులతో పాటు ఘాట్‌రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండపైన నెలవైన పలు నీటి కుంటలను అభివృద్ధి చేసి వన్యప్రాణులను సంరక్షిస్తామన్నారు. కొండ దిగువన అటవీశాఖ ఆధ్వర్యంలో పల్లెవనం ఏర్పాటు చేయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటానన్నారు.

ఆలయ ఆదాయం రూ.7.13 లక్షలు

పృథులగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలను ఆలయ అధికారులు భక్తుల సమక్షంలో లెక్కించారు. ఆలయానికి వివిధ రూపాల్లో రూ.7లక్షల13,568 ఆదాయం వచ్చినట్లు ఈవో నారాయణ రెడ్డి తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.70,590, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.70,500, కేశఖండనం టిక్కెట్లు ద్వారా రూ.13,660, హుండీల ద్వారా రూ.5 లక్షల 53,818 ఆదాయం సమకూరినట్లు ఆయన వెల్లడించారు.


పోటీలను ప్రారంభిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కొమరోలు, మార్చి14(ఆంధ్రజ్యోతి) మండలంలోని అల్లీనగరం పంచాయతీలోని జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మారెడ్డిపల్లి సమీపంలో వెలసిన భూదేవి శ్రీదేవి సమేత శ్రీతిరుమలనాథస్వామి దేవాలయంలో తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన కుందరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత ప్రథమ బహుమతి రూ.60 వేలు గెలుచుకొంది. ద్వితీయ, తృతీయ, నాల్గోవ, ఐదవ స్థానాల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన వీరాస్వామి చౌదరి ఎడ్లజత, నంద్యాల జిల్లాకు చెందిన కుందరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత, బోడుచెర్లకు చెందిన నక్షత్రరెడ్డి ఎడ్లజత వీరయ్యపాలెంకు చెందిన నాజీర్‌బాషాల ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. వీరికి వరసగా రూ.40 వేలు, 30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్ల యజమానులను సన్మానించారు. కార్యాక్రమాన్ని యాంకర్ ప్రకాశం జిల్లా అక్కపల్లి గ్రామానికి చెందిన కొండు వెంకట్రామిరెడ్డి పాల్గొని రైతులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, నాయకులు బిజ్జాల తిరుమలరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంటకసుబ్బయ్య, లక్ష్మీనరసయ్య, రామస్వామి, నక్కా వెంకట రమణ, మద్దిలేటి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల హోలీ

ఒంగోలు కల్చరల్, మార్చి 14(ఆంధ్ర జ్యోతి):హోలీ పండుగను శుక్రవారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. హోలీ పౌర్ణమి ఈ సంవత్సరం శుక్రవారం రావటం మరింత విశేషాన్ని సంతరించుకుంది. పండుగ రోజు ప్రజలు ముఖ్యంగా ఉత్తరాది వారు లక్ష్మీ పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుతారు. ఇక అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం రావటంతో ప్రజలు లక్ష్మీపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే నగరంలోని చిన్నా, పెద్దా రంగుల చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వివిధ వ్యాపారాల రీత్యా నివసించే గుజరాతీయులు స్థానిక గాంధీరోడ్డులో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.




ఉత్సాహంగా రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



హోలీ రంగులు పోలీసు కుటుంబాలలో కాంతులు వెదజల్లాలి : ఎస్పీ

ఒంగోలు క్రైం : హోలీ పండుగకు చల్లుకున్న రంగులు పోలీసు కుటుంబాలలో కాంతులు వెదజల్లాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు క్రీడా మైదానంలో హోలీ వేడుకలు జరిగాయి. ఎస్పీ పోలీసు కుటుంబాలతో కలిసి రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడుపై విజయానికి సంకేతం హోలిపండుగ అని అన్నారు. హోలీ పండుగ ప్రజల జీవితాలలో శాతి, సంతోషాలను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లాలో 183 పరీక్షా కేంద్రాలు
● 29,602 మంది విద్యార్థులు ● 9 ఫ్లయింగ్ స్క్వాడ్లు

ఒంగోలు విద్య, మార్చి 14(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని 618 పాఠశాలల నుంచి మొత్తం 29,602 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. వారిలో 95 శాతం మంది ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు కావడం గమనార్హం. పరీక్షకు 28,176 మంది ఇంగ్లీషు మీడియం, 1,423 మంది తెలుగు మీడియం, ముగ్గురు ఉర్దూ మీడియం విద్యార్థులున్నారు. కేవలం 100 మంది మాత్రమే ఒక సారి ఫెయిలైన విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. వారిలో బాలురు 14,994 మంది, బాలికలు 14,608 మంది ఉన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా మొత్తం 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 6 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి వాటికి సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థులు అర్ధగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారు. బాలికలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు సచివాలయాల్లోని మహిళా పోలీసులను కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

నో ఫోన్ జోన్

పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించారు. పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లను అనుమతించరు. పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, ఇన్విజిలేటర్లు, పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించేవారు సెల్ ఫోన్లు తీసుకురాకూడదు. స్క్వాడ్ అధికారులు, ఇతర అధికారులు పరీక్షా కేంద్రాలు తనిఖీ, పరిశీలనకు వచ్చినపుడు వారు తమ ఫోన్లను తమ వాహనాల్లోనే ఉంచి పరీక్షా కేంద్రాలలోకి రావాలి. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ వాచ్‌లు, లాప్ టాప్‌లు, ట్యాబులు, కెమెరాలు, బ్లూటూత్ డివైజ్‌లు, ఇయర్ ఫోన్లు, ఇయర్ ప్యాడ్‌లను పరీక్షా కేంద్రాలలోకి తీసుకురాకూడదు.

9 ఫ్లయింగ్ స్క్వాడ్లు

పరీక్షలలో కాపీయింగ్‌ను అరికట్టేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలు పరిధిలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేస్తారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను వాట్సాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కూడా కల్పించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు విద్యాశాఖ అదనపు డైరక్టర్ ఏ.వి.సుబ్బారెడ్డిని రాష్ట్ర పరిశీలకులుగా నియమించారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సెట్-1, సెట్-2లను పోలీస్ స్టేషన్లలోని స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు. పరీక్షల అధికారులు సిబ్బంది అందరికీ ఇప్పటికే నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

ప్రత్యేక నిఘా

పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక నిఘాను పెట్టింది. నిర్వహణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం జిల్లాకు వచ్చి ఇతర జిల్లా అధికారులతో నేరుగా పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. తప్పు జరిగితే ఉపేక్షించేదిలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కాపీయింగ్‌కు సహకరించినా, ప్రోత్సహించినా యాక్ట్ 25 ప్రకారం కఠిన చర్యలుంటాయి. నేర తీవ్రతను బట్టి జైలు శిక్ష, 5 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించేందుకు ఆ యాక్టు ప్రకారం అవకాశం ఉంది.


ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న హైవే అధికారులు

ఒంగోలులో రెండో బైపాస్ ఏర్పాటుపై చర్చ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం పడమర వైపు రెండో బైపాస్ రోడ్డు ఏర్పాటుపై లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయంలో నేషనల్ హైవే పీడీ విద్యాసాగర్, ఆర్అండ్‌బీ ఈఈ గోపీనాయక్‌తో చర్చించారు. ఇటీవల రెండవ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరిని ఎంపీ మాగుంట కోరారు. ఆ రోడ్డు ఆవశ్యకతపై మాగుంట సంబంధిత అధికారులతో చర్చించారు. అదే విధంగా సింగరాయకొండ వద్ద ఉన్న ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై కూడా ఆ శాఖ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

నేడు బాలికల వసతిగృహానికి శంకుస్థాపన

జరుగుమల్లి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామేపల్లి గ్రామంలో మంజూరైన కస్తూర్బా బాలికల రెసిడెన్షియల్ వసతిగృహ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన జరగనుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శంకుస్థాపన చేస్తారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు తెలిపారు. సమగ్రశిక్ష శాఖ ద్వారా నిర్మాణానికి దాదాపు కోటీ 95 లక్షల రూపాయలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

17 నుంచి ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం

● నాలుగు విడతలుగా నిర్వహణ ● ఆర్ఐవో సైమన్‌విక్టర్

ఒంగోలు(విద్య), మార్చి14(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 17వ తేదీ నుంచి ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే సంస్కృతం సబ్జెక్ట్ మూల్యాంకనం జరుగుతుండగా 17 నుంచి పూర్తిస్థాయి మొదలవుతుందన్నారు. కాగా జవాబుపత్రాల మూల్యాంకనం నాలుగు విడతలుగా జరుగుతుందని ఆయన చెప్పారు. ఈనెల 17నుంచి మొదటి విడతలో జనరల్ ఇంగ్లీష్, ఒకేషనల్ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్, ఒకేషనల్ ఎల్ఎండీ, ఏఅండ్‌టీ, డీఏ, సీఎస్ఈ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ పేపర్ల మూల్యాంకనం మొదలవుతుంది. ఇక 22న రెండో విడతలో ఫిజిక్స్, ఎకానమిక్స్, జీఎఫ్‌సీ, ఒకేషనల్ పేపర్ల మూల్యాంకనం, 24న మూడవ విడత కెమిస్ట్రీ, హిస్టరీ, 26న నాల్గవ విడతలో బోటనీ, కామర్స్, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు దిద్దటం మొదలు పెడతారు. ఇక మూల్యాంకనం విధులకు నియమితులైన అధ్యాపకుల నియామకపు ఉత్తర్వులను బోర్డు ఆయా కళాశాలల లాగిన్‌లో ఉంచింది. ప్రిన్స్‌పాళ్లు స్పాట్‌కు నియమితులైన అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయాలని ఆర్ఐవో కోరారు. స్పాట్‌కు హాజరు కాకపోతే బోర్డుకు రూ.5వేల అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

మద్యం వ్యాపారులు నిబంధనలు పాటించాలి

● జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఖాజామోహిద్దీన్
● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు క్రైం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఖాజామోహిద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఎక్సైజ్ వసూళ్ళ కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలో మొత్తం 188 మద్యం దుకాణాలు ఉన్నాయని, వాటిల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అనధికార మద్యం విక్రయాలకు సంబంధించి 360 కేసులను నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలపై నిత్యం దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల యజమానుల నుంచి నగదు వసూలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు.

'పశ్చిమం'లో కందుల కొనుగోలు కేంద్రాలు

● ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వం మద్దతు ధరతో కందులను కొనుగోలు చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ ఒక క్వింటా కందులు రూ.7,550 రూపాయలు, శనగలు రూ.5,650ల చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, పీఏసీఎస్ రమాదేవి, సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, జవ్వాజి రామాంజులరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలిలో..

పొదిలి : రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతుల పండించిన కంది, మినుము, శనగలకు గిట్టుబాటు ధరకల్పించేందుకు కూటమి ప్రభుత్వం సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజీనాయక్, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ పొదిలి ఏవో షేక్ జైన్‌లాబ్దిన్ పలువురు అధికారులు పాల్గొన్నారు.


మార్కాపురం మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు

తర్లుపాడులో..

తర్లుపాడు: తర్లుపాడులో ఏపీ మార్కెట్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, ఏవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ ద్వారా కందులు క్వింటా రూ.7,550కు కొనుగోలు చేస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలో శనగల కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ పీఏసీఎస్ ఇన్‌చార్జ్ కె.వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ సీవో తుంబేటి కాశయ్య, వ్యవసాయ సహాయకులు దేవేంద్రగౌడ్, గోవింద్ బాషా, శంకర్, టీడీపీ నాయకులు కాశంగి శ్రీనివాసులు, గోను వెంకటేశ్వర్లు, జి.సుబ్బయ్య, జనసేన పార్టీ నాయకులు పవన్ రత్నకుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గాయం లక్ష్మీరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఒంగోలులోని అగ్నిమాపకకేంద్రంలో ఉన్న ఫైర్ ఇంజన్లు

అగ్గి ఆర్పేందుకు.. సిబ్బంది ఏరి..?

ఒంగోలు, కొండపిలోని అగ్నిమాపక కేంద్రాల్లో ఇదీ పరిస్థితి



కొండపిలో ఉన్న 2000 సంవత్సరం నాటి అగ్నిమాపక వాహనం

ఆంధ్రజ్యోతి విజిట్

జిల్లాలోనే అత్యధికంగా ఒంగోలులో అగ్ని ప్రమాదాలు

● రెండు షిఫ్ట్‌ల్లో సిబ్బంది విధులు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో సాధారణంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పితేనే నష్టం విలువ తగ్గించవచ్చు. అయితే జిల్లా కేంద్రమైన ఒంగోలులో సిబ్బంది సమస్య వేధిస్తున్నది. ఒంగోలు పరిధిలో ఏడాదికి సుమారు 220కి పైగా అగ్ని ప్రమాదాలు జరుగుతుండగా, ఇక రోడ్డు ప్రమాదాలు, విపత్తులు, ఇతర రెస్క్యూలు మరో 25 వరకు ఉంటాయి. అయితే ఒంగోలు అగ్నిమాపక కేంద్రంలో 2 ఫైర్ ఇంజన్లు ఉండగా, మరో రెస్క్యూ వాహనం ఉంది. ఇదిలా ఉంచి అవసరమైన నీరు కూడా పుష్కలంగానే ఉంది. కార్యాలయం ఆవరణలో ఊట బావి ఉండంతో నీటికి ఢోకా లేదు. ఉన్న వాహనాలు కూడా ప్రస్తుతానికి కండీషన్‌లోనే ఉన్నప్పటికీ అవసరమైన సిబ్బంది సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా కేంద్రం కావడంతోపాటు, అపార్ట్‌మెంట్‌లు, అధునాతన భవంతులు అత్యధికంగా ఉండటమే కాకుండా అదే స్థాయిలో జిల్లాలోనే ఎక్కువ అగ్ని ప్రమాదాలు ఇక్కడే జరుగుతున్నాయి. గత కొన్నేళ్ళుగా సరిపడా సిబ్బంది లేకపోవడం, కొత్తగా నియామకాలు చేపట్టకపోవడంతో ఉన్న వారితోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం 15 మంది ఉండగా, ఏడుగురు చొప్పున రెండు షిఫ్ట్‌లలో విధులు నిర్వరిస్తున్నారు. అయితే అదనంగా మరో పది మందిని నియమించాల్సి ఉంది. మొత్తంగా వేసవిలో తరచూ ఎదురయ్యే ప్రమాదాల నివారణపై అంటుకున్నాక ఆలోచించకుండా, ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండపి కేంద్రంలో 10 మందే విధుల్లో..

తరచూ మరమ్మతులకు గురవుతున్న ఫైర్ ఇంజన్లు

కొండపి, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో పొగాకు బ్యారన్‌లు అధికం. మూడు నెలలుగా తరచుగా క్యూరింగ్‌లోని పొగాకు బ్యారన్‌లు అగ్ని ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనం వచ్చేలోపే యజమానులకు ఆస్తి నష్టం వాటిల్లుతోంది. స్థానిక కేంద్రంలో 17 మంది సిబ్బంది ఉండాల్సి ఉంటే పది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక్కడి వాహనం కూడా పాతికేళ్లనాటిది. తరచూ మరమ్మతులకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ నలుగురు డ్రైవర్‌లు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు ఉంటున్నారు. ఒకరు డిప్యుటేషన్‌పై ఒంగోలు కేంద్రంలో సేవలు అందిస్తుండగా, మరో పోస్టు ఖాళీగా ఉంది. కొండపి కేంద్రంలో ఇద్దరు డ్రైవర్లతోపాటు లీడ్ ఫైర్‌మెన్‌లు ముగ్గురు, ముగ్గురు మెన్‌లు ఒక హోంగార్డు ఉన్నారు. వీరిని పర్యవేక్షించే స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. కొండపిలోని అగ్నిమాపక వాహనం కొండపి, మర్రిపూడి, సంతనూతలపాడు, జరుగుమల్లి, పొన్నలూరు మండలాలకు చెందిన దాదాపు 70 నుంచి 80 గ్రామాలకు సేవలు అందించాల్సిన ఈ అగ్నిమాపక కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కారు ఢీకొని పాలేటిపాడువాసి మృతి

మరొకరికి గాయాలు ● సంగెంలో ఘటన



బండారుబాబు మృతదేహం

సంగెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బండారు బాబు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా మండల కేంద్రమైన సంగెంలో జరిగింది. సంగెంలో బండారుబాబు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఆయన తన మిత్రుడితో కలిసి మండలంలోని తిమ్మాపురంలో పని ముగించుకొని బైక్‌పై సంగెంకు వస్తున్నారు. ఈక్రమంలో వారి బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బండారుబాబు(34) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న ఉలవపాడు గ్రామానికి చెందిన పులగర శివమణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శివమణిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. బండారు బాబు మృతదేహన్ని ఎస్ నరేష్ పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. బాబు భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వాహనాన్ని గుర్తించినట్లు చెప్పారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉల్లాసంగా శ్రీచైతన్య స్పోర్ట్స్ మీట్



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న విద్యాసంస్థల ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల స్పోర్ట్స్‌మీట్ సంబరాలు శుక్రవారం ఒంగోలులో ఉత్సాహంగా జరిగాయి. డాక్టర్ బీఎస్‌రావు మెమోరియల్ స్పోర్ట్స్‌లో భాగంగా లాయర్‌పేట, వీఐపీరోడ్డు, భాగ్యనగర్, మంగమూరు రోడ్డు, కందుకూరు, చీమకుర్తి, సింగరాయకొండ చైతన్య పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రాజేశ్వరి, ప్రముఖ కార్డియాలజిస్ట్ శివకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐ అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో మానసిక ఉల్లాసం, క్రీడల పట్ల ఆసక్తి, నైపుణ్యం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తంబి హర్షవర్ధన్, శేషయ్య, అపర్ణ, లక్ష్మణ్, సురేష్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతంపై కృతజ్ఞతలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో గత నెలలో జరిగిన ప్రకాశం బాలోత్సవం విజయవంతంలో భాగస్వాములైన వారందరికీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కలపాల సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం డి.వీరాంజనేయులు అధ్యక్షత జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక స్పృహ, శాస్త్రీయ ఆలోచనలు, సౌభాతృత్వం పెంపొందించేందుకు బాలోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.సుబ్రహ్మణ్యం, ఎస్.రవి, డీఎల్.ప్రసాద్, ఉమామహేశ్వరి, సురేష్, షేక్ అబ్దుల్ హై, దామా శ్రీనివాసులు, బాలకోటయ్య, సీహెచ్.వినోద్, వీరస్వామి, కేఎఫ్‌బాబు, ఎస్‌వీ.రంగారెడ్డి, తిరుపతయ్య, ఎం.భాస్కర్, నర్రా సురేంద్రబాబు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి ఆరోపణలు అవాస్తం

● వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనేక పదవులు అనుభవించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయసాయిరెడ్డి ఒక వ్యాపారవేత్తగా వచ్చి పార్టీని అడ్డుపెట్టుకొని ఆయన కుటుంబం ఆర్థికంగా పెరగాలనే ఉద్దేశంతో పని చేశారన్నారు. కూటమితో కుమ్మక్కై జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. సమావేశంలో కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కేవీవీ.ప్రసాద్, కఠారి శంకర్, రమణమ్మ, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్‌సేవ



స్వామివార్ల ఊంజల్‌సేవలో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం స్వామివార్లను వేదపండితులు పరాంకుశం ప్రసాద్‌చార్యులు, పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం యాగశాలవైదిక కార్యక్రమాలను, దీపాలంకరణ, ఊంజల్‌సేవ చేశారు. తదుపరి గ్రామోత్సవం చేశారు. పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్‌పై సమరం'



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వరరావు స్థానిక దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవగాన కల్పించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగించవద్దని తెలిపారు. అలాగే హోటల్ యాజమాన్యాల వారు ప్లాస్టిక్‌కు బదులుగా అరటి ఆకులు, ఇస్తరాకులు, సిల్వర్ కవర్ల వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రాణాంతకమైన ప్లాస్టిక్ కవర్ల వినియోగించడం ద్వారా పశువులు మరణిస్తున్నాయని, అలాగే మనుషులు క్యాన్సర్ బారిన పడతారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న సమితి నాయకులు

చీమకుర్తి, మార్చి14(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుచున్న విద్యార్థులకు ఏకలవ్య సేవాసమితి ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. అంతేగాకుండా పరీక్షా కేంద్రం వద్దకు వెళ్లేందుకు అవసరమైన ఆటో ఖర్చులకు నగదును అందజేశారు. పరీక్షా సామగ్రిలో భాగంగా రైటింగ్‌ప్యాడ్, పెన్నులు తదితరాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అణగారిన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, సీహెచ్.అశోక్, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పొదిలి కాశయ్య, అంజనేయులు, చింతలపాలెం యలమందబాబు, సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, మధుబాబు, రుద్రనాయక్, కేశవులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక శర్మా కాలేజీలో జరిగిన పోటీలలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన బ్యాంకు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో కెనరా చాంపియన్‌షిప్ జట్టు విజయం సాధించగా, కెనరా స్ట్రైకర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ విజేతకు ట్రోఫీని అందజేశారు.

జాతీయస్థాయిలో పీవీఆర్ విద్యార్థిని ప్రతిభ



ట్రోఫీతో ఆముక్త

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల విద్యార్థిని ఆముక్త జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలలో సత్తా చాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆముక్త ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 22వ జాతీయ స్థాయి మహిళా చాంపియన్‌షిప్ పోటీలలో అండర్-13 విభాగంలో ఆంధ్రజట్టు తరుపున పోటీల తలపడి కాంస్య పతకాన్ని సాధించారు. జనవరిలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో పదమూడేళ్ళ వయస్సు ఓపెన్ విభాగంలో ప్రపంచ స్థాయిలో 11వ స్థానంలో నిలవగా, తాజాగా జరిగిన పోటీలలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు చాటారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో కిరణ్‌కుమార్, ఆముక్తను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా అపర్ణ



అపర్ణకు నియామక పత్రం అందిస్తున్న శ్రీనివాసరావు, సూర్యకల్యాణచక్రవర్తి

నాగులుప్పలపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షురాలిగా పోద అపర్ణ నియామకమయ్యారు. శుక్రవారం ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు ఆమెకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అపర్ణను పలువురు నాయకులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, పునుగుల రవిశంకర్, పీవీ.కృష్ణారెడ్డి, రాయపాటి అజయ్‌కుమార్, పువ్వాడ దామోదర్, పేముల మోజి, పోద వరప్రసాదరావు, దండే శ్రీను పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

టంగుటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం జాతీయ రహదారిలో ఐఓసీ ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కార్యాలయంలో జరుగుతుందని మండల అధ్యక్షుడు కామని విజయకుమార్ తెలిపారు. సాయంత్రం 3 గంటల జరిగే సమావేశానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీఈవో

జరుగుమల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని డీఈవో కిరణ్‌కుమార్ అన్నారు. కె.బిట్రగుంటలోని కేజీబీవీ స్కూల్‌లో ఐదు రోజులుగా జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో భాగంగా గైడ్స్‌కు జరిగిన ముగింపు సమావేశంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గైడ్ కమిషనర్ బి.హెప్సీబా, హెచ్ఎం స్రవంతి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎస్ఎన్‌లో హోలి

ఒంగోలు(విద్య), మార్చి14(ఆంధ్రజ్యోతి): స్థానిక మంగమూరురోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి హోలి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రాజేంద్రబాబు, నీలిమా, నిరోషా, వైస్ ప్రిన్స్‌పాల్ రాజశేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం, వెల్లంపల్లి, మద్దిపాడు ప్రాంతాలలో నివసించే రాజస్థానీయులు హోలీ నిర్వహించగా వారికి గణపతిసింగ్ స్వీట్లు పంపిణీ చేశారు. రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

●ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), మార్చి 14(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు సాగర్‌నీటితో చెరువులను పూర్తిగా నింపాలన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ దగ్గర మోటార్లు మరమ్మతులు చేయించాలని చెప్పారు. ఎంపీడీవో, ఈవోఆర్డీలు గ్రామాల్లో వారానికి రెండు రోజులు పర్యటించి పరిశీలించాలని కోరారు. ఒంగోలు నగరం పూర్తిగా కాంక్రీట్ జంగిల్ అయిందని, ఈక్రమంలో నగరంతో పాటు గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. నివేశన గృహాలు అవసరమైన వారి పేర్లు పంచాయతీ కార్యదర్శులు సేకరించాలన్నారు. ఒంగోలు నగరంలో పేదలకు 2సెంట్లు, గ్రామాల్లో పేదలకు 3 సెంట్లు ఇవ్వటానికి అవసరమైన స్థలాలు పరిశీలించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందేలా మండల వ్యవసాయశాఖ అధికారి సమాచారం వారిని అందించాలన్నారు. ఐదు ఎకరాల్లోపు విస్తీర్ణం గల చెరువులకు వాకింగ్‌ట్రాక్, చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తామని ఎమ్మెల్యే దామచర్ల వివరించారు. శ్మశానాలకు చుట్టూ ప్రహరీలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, అందువల్లో షెడ్డులాంటివి నిర్మిస్తామన్నారు. పాతపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు, తహసీల్దార్ కె.వాసు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏవో శేషబాబు, కరవది పీహెచ్‌సీ వైద్యాధికారి సుందరప్రసాద్, పశువైద్యాధికారి వై.భూపాల్‌రెడ్డి, ఏవో కిషోర్‌బాబు, ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష, పీఆర్ ఏఈ రామ్‌ప్రసాద్, ఎంపీటీసీలు వాణి, పాలేటి శ్రీనివాసరావు, గుండపనేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మండవ వెంకటసుబ్బయ్య, కోదండరామిరెడ్డి, మురళి పాల్గొన్నారు.

యంత్ర పరికరాలకు రూ.2.79 కోట్లు మంజూరు

● ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయయంత్ర పరికరాలను రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.79 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో రైతులకు వ్యక్తిగతంగా 1700 యూనిట్లను అందించనుంది. వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్‌తో నడిచే గొర్రు, నాగళ్ళు, రోటవేటర్, బ్లేడు, డ్రిల్స్, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు, పురుగుల మందులు పిచికారి చేసే బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్‌స్ప్రేయర్లను అర్హులైన రైతులకు రాయితీపై సరఫరా చేయనున్నారు. ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు ఇచ్చేవిధంగా మార్గదర్శకాలు జారీచేసింది. గత మూడేళ్లలో ఏదో ఒక సీజన్‌లో ఈ-పంట నమోదై ఉండి గత ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వ పథకాల కింద వ్యక్తిగతంగా లేదా సీహెచ్‌సీ ద్వారా కానీ పరికరాలు తీసుకోని వారికి అందిస్తున్నారు. ఒక కుటుంబంలో ఒక వ్యవసాయ పరికరాన్ని మాత్రమే అందిస్తారు. ఆ రైతు కచ్చితంగా వెబ్‌ల్యాండ్ లేదా ఆర్‌వోఆర్‌లో నమోదై ఉండాలి. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపుస్తకాల నకళ్ళు, ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ పత్రాలను, ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధృవీకరణ పత్రాలను తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు కోరారు. రాయితీ మినహా మిగలిన మొత్తాలను ఆన్‌లైన్(యూపీఐ, ఎన్ఈఎఫ్‌టీ) ద్వారా చెల్లించాలన్నారు. దరఖాస్తు సమయంలో రైతు ఆధార్‌నెంబరుకు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌ను కూడా ఓటీపీ కోసం అందుబాటులో ఉంచుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

● పిఠాపురం వెళ్లిన శ్రేణులు



కేక్ కట్‌చేస్తున్న జనసేన పార్టీ కార్పొరేటర్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలోని బొమ్మరిల్లులో అనాథ పిల్లల సమక్షంలో ఆ పార్టీ కార్పొరేటర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయడంతో పాటు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్పొరేటర్లు మాట్లాడుతూ పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు ఈదర సురేష్, యనమల నాగరాజు, గోపాల్‌రెడ్డి, లక్ష్మీకోటేశ్వరమ్మ, తాడి కృష్ణలత, నీలం సరోజ, ఎండేటి పద్మ, నాయకులు గోలి తిరుపతిరావు, కరుణాకర్, బండారు శేషగిరి, కుంచాల శ్రీనివాసరావు, తన్నీరు నాగేశ్వరరావు, ఎండేటి రంగారావు పాల్గొన్నారు.

పిఠాపురం తరలి వెళ్లిన జనసైనికులు

పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభకు జిల్లా నలుమూలలనుంచి ఆపార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. జనసేన పార్టీ ఏర్పాటు చేసి 12 ఏళ్ళుపూర్తయిన సందర్భంగా ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో భారీ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు నిర్వహణకు జిల్లాకు చెందిన పలువురు పార్టీ ముఖ్యనేతలకు అవకాశం కల్పించారు. మాజీమంత్రి, పార్టీ సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి మూడు రోజులుగా పిఠాపురంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మరో నేత కంది రవిశంకర్ కూడా అక్కడే ఉండి పార్టీ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో మాజీమంత్రి బాలినేనితో పాటు కంది రవిశంకర్ కూడా పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేకంగా బస్సులు, వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఆపార్టీ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో వాహనాల్లో పిఠాపురం తరలివెళ్ళారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలి

● వామపక్షాల నాయకుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు వామపక్షాలు, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ ఉక్కు పోరాటానికి సంఘీభావంగా స్థానిక సాగర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ కేంద్రం ఒకవైపు ప్రైవేటీ కరణ చేయబోమని చెప్తూనే మరోవైపు ఉద్యోగాలు లేకుండా చేయడం, వేతనాలు, ముడిసరుకు ఇవ్వకుండా చేస్తోందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం అనేక మంది ప్రాణత్యాగాలు కూడా చేశారన్నారు. అటువంటి సంస్థను ప్రైవేటీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకులు ఎంఎస్.సాయి, ఆర్.మోహన్, కె.వీరారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సీహెచ్.రాంబాబు, టి.మహేష్, ఎస్‌డీ.సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, జి.రమేష్, కె.రమాదేవి, బాలకోటయ్య, లలితకుమారి, రాజశేఖర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలి

ఒంగోలు(రూరల్), మార్చి14(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం దగ్గర గల జగనన్న లేఅవుట్‌లలో పేదలకు నివేశ స్థలాలు వెంటనే కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు ఆధ్వర్యంలో ఆయా జగనన్న కాలనీలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు 20వేల మందిపైగా నివేశన స్థలాలు ఇచ్చేందుకు నాడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేశారన్నారు. అయితే పొజిషన్ చూపించ లేదన్నారు. అందువల్ల లబ్ధిదారులకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రమాదేవి, జి.రమేష్, శ్రీనివాసరావు, సయ్యద్‌హుసేన్, టి.మహేష్, బీవీ.రావు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముసిపై చప్టా నిర్మించాలి

కొండపి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం- టంగుటూరు మండలం లక్కవపాలెం వద్ద ముసిపై నేల చప్టా నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ముసిలో చప్టా నిర్మాణ ప్రదేశాన్ని ఈసందర్భంగా సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ చప్టా నిర్మాణం వల్ల దాదాపు 30 గ్రామాల ప్రజలకు ఒంగోలు చేరేందుకు దగ్గర దారి వసతి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నేలచప్టా నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

అవీ..ఇవీ

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తాం

కంభం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కంభం పంచాయతీలోని పలు వీధుల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, మురుగును తొలగిస్తామని కంభం పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి జిల్లా అధికారులకు తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కంభం పంచాయతీ కంపు కంపు' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సమస్యలపై ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టి మురికిని పూర్తిగా తొలగించి దోమల నివారణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సచివాలయ- 2 సర్వేయర్‌పై వేటు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సర్వే నెంబరు 58-1లో ఇటీవల జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్, ధ్రువీకరణ పత్రాల వ్యవహారంలో జరిగిన అవినీతిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయ అప్పటి తహసీల్దార్ బాల కిషోర్, సచివాలయం-2 వీఆర్వో ఎం ఎల్లయ్య , సర్వేయర్ దీలిప్‌లపై వేటు వేసింది. అందులో భాగంగానే సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ వెంకటేశ్వరరెడ్డిని కూడ సస్పెండ్ చేస్తూ, కలెక్టర్ ఉత్వర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దారు శైలేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు.

ఇరువురికి గాయాలు

గిద్దలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాచర్లఫారం సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రాచర్ల ఫారం సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ముందుగా వెళుతున్న మోటార్‌సైకిల్‌ను స్పీడ్‌బ్రేకర్ వద్ద వెనుక నుంచి మరో మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో రాచర్లఫారం, మొహిద్దీన్‌పురం గ్రామాలకు చెందిన ఇరువురు మోటార్ సైక్లిస్టులు గాయపడ్డారు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



పరీక్ష అట్టలు అందజేస్తున్న రమణారెడ్డి

పెద్దదోర్నాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక వసంత జూనియర్ కళాశాల, బీఎం డిగ్రీ కళాశాలల చైర్మన్ బట్టు రమణారెడ్డి సహకారంతో వెయ్యిమంది విద్యార్థులకు పరీక్ష వస్తువుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ పవన్ కుమార్ రెడ్డి, బాష అధ్యాపకులు కాశీరాంనాయక్, రిత్విక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని సీతారామకల్యాణ మండపంలో ప్రాంతీయ విద్యాసదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా ఉద్యోగులను నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి నట్టేట ముంచారన్నారు. విద్యావిలీనం పేరుతో గ్రామాల్లోని చిన్నారులకు విద్యను దూరం చేశారన్నారు. కరోనా సమయంలో ఉపాధ్యా యులను ప్రభుత్వం మద్యం దుకాణాల వద్ద విధులు కేటాయించి వారి వృత్తిని కించపరిచారన్నారు. వైసీపీ పాలకుల అరాచక పాలనకు విసుగెత్తిన ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడి 2024 ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. వారందరి మద్దతు మరువలేనిదన్నారు. గత పాలనలో జరిగిన నష్టాలను అధిగమిస్తామని, విద్యారంగాన్ని ముందంజలో నడిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ 1947 నుంచి ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. పీఆర్‌సీ కమిటీని వెంటనే వేయాలని కోరారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.జిలాని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండు రంగవరప్రసాద్, ఆ సంఘం జిల్లా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.జనార్ధన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, రాచర్ల, కొమరోలు ఎంపీపీలు షేక్ ఖాశింబీ, అమూల్య, పాల్గొన్నారు.

1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

గిద్దలూరుటౌన్ : తమను రెగ్యూలర్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, 12 నెలల వేతనం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఆలయ కమిటీ బాధ్యతల స్వీకరణ

కంభం : కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బెల్లంకొండ శ్రీనివాసరావు, వీశ్వేరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గుడిపాటి చిన్నవెంకటయ్య ప్రమాణ స్వీకారంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదా సుభద్ర, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే స్వర్ణాంధ్రలో భాగంగా తురిమెళ్ల గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుండి మంజూరైన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈవోఆర్‌డీ విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఇ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

● దొంగను అరెస్టు చేసిన పోలీసులు

కంభం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కంభం రైల్వేస్టేషన్ నుండి ఇంటికి వస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు ను లాక్కొని వెళ్లిన దొంగను అదుపులోకి తీసుకుని గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 11న మందా హుస్సేనమ్మ కంభం రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి ఒంటరిగా వస్తుండగా నెహ్రూనగర్ 6వ లైన్‌లో ఆమె మెడలోని 2.40 లక్షల విలువైన బంగారు తాళిబొట్లు గొలుసును గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన షేక్ సలీమ్ లాక్కుని పరారయ్యాడు. దొంగను గుర్తించి 13న గురువారం సాయంత్రం రావిపాడు రోడ్డులో ఉండగా అరెస్టు చేసి బంగారు సరుడును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసును త్వరితంగా చేధించిన ఎస్సైని, సిబ్బంది షేక్ బషీర్, కె.రమేష్, మహబూబ్‌సుభాని, సి.హెచ్.వీరయ్య, శివలను డిఎస్పీ నాగరాజు, కంభం సీఐ మల్లికార్జున అభినందించారు.

తుక్కు శకటాలే దిక్కు

● వేసవి ముంగిట అగ్నిమాపక శాఖ తీరిది ● దశాబ్దాలనాటి వాహనంతోనే అత్యవసర సేవలు ● దోర్నాలలో అసలే లేదు
● వెంటాడుతున్న సిబ్బంది కొరత ● ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిందే



గిద్దలూరులోని ఫైర్ స్టేషన్

గిద్దలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో ఫైర్‌ఇంజన్ గుర్తుకు వస్తుంది. కానీ గత వైసీపీ ప్రభుత్వానికి మాత్రం ఇంతటి ప్రాధాన్యత కలిగిన శాఖను అసలు పట్టించుకోలేదు. గిద్దలూరు ఫైర్‌స్టేషన్‌లో 10 ఫైర్‌మెన్ పోస్టులు ఉండగా మూడేళ్లుగా 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫైర్‌మెన్ పోస్టులను భర్తీ చేయకుండా పోలీసుశాఖ నుంచి నలుగురు హోంగార్డులను అగ్నిమాపకశాఖకు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. గత ఏడాది ఫైర్ ఆఫీసర్ రిటైర్డ్ కాగా అప్పటి నుంచి కొత్త వారిని నియమించక పోవడంతో ఇన్‌చార్జి పాలనలోనే నడుస్తోంది. గిద్దలూరు ఫైర్‌స్టేషన్‌లో 2013 మోడల్ ఫైర్ ఇంజన్ ఉంది. ఎప్పటికప్పుడు రిపేర్లు చేయించుకుంటూ ఆ వాహనాన్నే నేడు వినియోగిస్తున్నారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు కలిపి గిద్దలూరులో ఫైర్ స్టేషన్ ఉన్నది. మూడు మండలాలకు ఒకటే ఫైర్ ఇంజన్ ఉండడంతో ఒకే పర్యాయం రెండు మూడు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగితే అదుపుచేయలేని పరిస్థితి ఉంది. గత వైసీపీ హయాంలో మూడేళ్లక్రితం కొమరోలులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ భీమానాయక్ తెలిపారు. అయితే ఆ తరువాత కొమరోలులో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఎలాంటి అడుగులు పడలేదు.

కంభం : ఏటా ఎండలు అధికంగా పెరుగుతూనే ఉన్నాయి. వేసవి అంటే అగ్నిప్రమాదాల కాలం. ముఖ్యంగా గడ్డివాములు, పూరిగుడిసెలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. కంభం, బేస్తవారపేట, అర్థవీడు మండలాలకు కలిపి ఒకటే అగ్నిమాపక కేంద్రం ఉంది. 1988లో ప్రారంభించిన అగ్నిమాపక కేంద్రంపై ఈ మూడు మండలాలకే కాక మార్కాపురం డివిజన్‌లో ఏ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరిగినా కంభం అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్ళాల్సిందే. అంతటి కీలకంగా కంభం అగ్నిమాపక కేంద్రంలో 25 ఏళ్లగా ఒక్కటే వాహనాన్ని వినియోగిస్తున్నారు. సాధారణంగా 15 ఏళ్ల దాటితే ఆ వాహనాన్ని తుక్కు కింద పరిగణిస్తారు. కంభం అగ్నిమాపక వాహనం 25 సంవత్సరాలుగా సర్వీసు ఇవ్వడంతో తరచూ మరమత్తులకు గురవుతోంది. అయినా నేటికీ మరమ్మతులు చేస్తూ వినియోగిస్తున్నారు. నూతన వాహనం కావాలని ఉన్నతాధికారు లకు సిబ్బంది చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి మొదటి వారంలో అర్థవీడులో గ్యాస్‌సిలెండర్ పేలి పూరిగుడిసె దగ్ధం కాగా అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి తిరిగి కంభం వస్తుండగా ఇంజన్ మొరాయించి ఆగిపోయింది. తిరిగి మరమ్మతులు చేయించి కంభం కార్యాలయానికి తీసుకువచ్చారు. 8 రోజులక్రితం అర్థవీడు మండలం బొమ్మిలింగంలో గ్యాస్ సిలిండర్ పేలి 3 పూరిగుడిసెలు దగ్ధమై సుమారు 4లక్షలకు పైగా నష్టం సంభవించింది. గడిచిన ఏడాది కాలంలో కంభం ఫైర్ స్టేషన్ పరిధిలో 50 అగ్ని ప్రమాదాలు సంభవించాయి. 9 మంది సిబ్బందికి గాను నలుగురే ఉన్నట్లు ఫైర్ ఆఫీసర్ చౌదరి తెలిపారు.

నీటి సౌకర్యం అంతంతమాత్రమే

పెద్దదోర్నాల : దోర్నాలలో అగ్నిమాపక కేంద్రం ఉన్నా ఫైర్ ఇంజను లేదు. ప్రమాద వశాత్తు అగ్నిప్రమాదాలు ఏర్పడితే ఇతర ప్రాంతాల నుండి తెప్పించు కోవాలసిన పరిస్థితి. ఈ లోగా అగ్ని ప్రమాదాలు స్థాయి దాటి తీవ్రనష్టం వాటిల్లే అవకాశం లేక పోలేదు. వేసవికాలం వచ్చేసింది ఎండలు మండుతు న్నాయి. మరోవైపు నల్లమల అటవీ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట కాలిపోతూనే ఉంది. ఇటీవల బలిజే పల్లి, గంటవానిపల్లె తదితర ప్రాంతాల్లో పంటలు మంటల్లో చిక్కినప్పుడు కూడా ఇతర ప్రాంతాల నుండి అగ్నిమాపక యంత్రాన్ని తెప్పించుకోవాలసిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై అగ్నిమాపక కేంద్రం అధి కారి హరిబాబును వివరణ కోరగా ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు రేపల్లె స్టేషనుకు తరలించామన్నారు. మూడు రోజుల్లో దోర్నాలకు వస్తుందన్నారు. 13 మంది సిబ్బంది ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాలతో 11 మంది అమరావతిలో విధులు నిర్వహించేందుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఇక అగ్నిమాపక కేంద్రానికి ప్రహరిగోడ సమస్య ఉంది.

ఎర్రగొండపాలెం రూరల్ : వేసవిలో ఎండల తీవ్రతకు గ్రామీణ ప్రాంతాలలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని ప్రమాదాలు జరగకుండా ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎర్రగొండపాలెం అగ్నిమాపక కేంద్రస్టేషన్ అధికారి డి.మాల్యాద్రి అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి విజిట్' సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలు ఉన్నాయి. కార్యాలయంలో స్టేషన్ ఆఫీసర్ తోపాటు ఫైర్ మ్యాన్‌లు ఏడుగురు, లీడింగ్ ఫైర్ మ్యాన్‌లు ముగ్గురు, డ్రైవర్లు ముగ్గురు ఉన్నారని ఆయన తెలిపారు. నీటినిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్చి నెల 1 నుండి ఇప్పటి వరకు 7 ప్రమాదాలు జరిగాయని వాటిలో సుమారు 3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి 08403-254244 కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.




కంభంలో ఇరవై ఐదేళ్లనాటి అగ్నిమాపక శకటం, దోర్నాలలో ఫైరింజనే లేని అగ్నిమాపక కేంద్రం

గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తాం : ఎరిక్షన్‌బాబు

నిర్మాణంలో ఉన్న మల్టీస్పెషాలిటీ వైద్యశాల పరిశీలన



వైద్యశాల నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గిరిజనుల మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల పూర్తయితే చెంచుగిరిజనులకు మెరుగైన వైద్యం లభిస్తుందన్నారు. మండలంలోని ఐనముక్కల సమీపంలో నిర్మిస్తున్న వైద్యశాలనిర్మాణం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ క్రమంలో అక్కడ ప్రాజెక్టు ఇంజనీరింగు అధికారిని పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని మరో ఏడాదికి పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా గూడూరి విలేకరులతో మాట్లాడారు. వైద్యశాల పనులు వేగవంతం అయ్యేందుకు సంబంధిత గుత్తేదారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అవసరమయ్యే తోడ్పాటు అందిస్తామన్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో అధికశాతం నిరుపేదలే ఉన్నారని వారికి అందు బాటులో ఉచితంగా కార్పొరేట్ వైద్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ మంజూర్‌బాష, కే.సుబ్బారెడ్డి, ఎలకపాటి చంచయ్య, బాష, జనసేన అధ్యక్షులు కేతి మురళి, గుర్రాల ప్రసాద్ పాల్గొన్నారు.

300 మందికి వైద్యపరీక్షలు



పాలుట్లలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వెంకటేష్‌నాయక్

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని నెక్కంటి, పొన్నలబైలు, నారుతడికల, పాలుట్ల గిరిజన గూడేలలో శుక్రవారం డాక్టర్ కె.వెంకటేష్‌నాయక్ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా గిరిజన గూడేలలో సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వెంకటేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వేసవికాలంలో రోగాలబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పిల్లలకు టీకాలు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయా వైద్య శిబిరాలలో ల్యాబ్ టెక్నీషియన్ జానారెడ్డి, ఏఎన్ఎం మాదవీలత, స్టాఫ్‌నర్స్ సుజాత, సూపర్‌వైజర్ చంద్రమోహన్, సిబ్బంది కొండయ్య నలగాటి వెంకటరామయ్య తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

పెద్దదోర్నాల, మార్చి14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని హెచ్‌ఎం అనసూయాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు శ్రద్ధగా చదివి అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, విజయ, నిర్మలకుమారి, రామానాయక్, రామానాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చిన్నగుడిపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

పెద్దదోర్నాల, మార్చి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో ఈ నెల 16న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ వైద్యులు బాలరాజుచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాలకు చెందిన శాంతిరామ్ వైద్యశాల వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు. శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలన్నారు.

15న అయ్యప్పస్వామి జయంతి

గిద్దలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం ముండ్లపాడులోని అభయాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 15న శనివారం అయ్యప్పస్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్పస్వామి భక్త బృందం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు అభిషేక కార్యక్రమాలు, సాయంత్రం 5గంటలకు గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు మెట్లపూజ, భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



వై.పాలెంలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

గిద్దలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాచర్ల మండల జనసేన నాయకులు నిర్వహించారు. కేక్‌కట్ చేసి దివ్యాంగ విద్యార్థులకు పంచిపెట్టారు. నిత్యవసర వస్తువులను పాఠశాలకు అందించారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేదల కోసం సొంత డబ్బును వెచ్చిస్తున్న వైనాన్ని వివరించారు. కార్యక్రమంలో రాచర్ల మండల జనసేన నాయకులు గోపాల్, శంకర్ నాయుడు, పుల్లారావు, రవితేజ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : జనసేన 12వ అవిర్భావదినోత్సవం సందర్భంగా ఎర్రగొండపాలెంలోని పార్టీ కార్యాలయంలో జనసైనికులు ఘనంగా నిర్వహించారు. జనసైనికులు నక్క శ్రీనివాస్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, జనసైనికులు పాల్గొని పార్టీ కార్యాలయ అవరణలో జెండా అవిష్కరించారు. కేకుకట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు బంటు క్రిస్టోఫర్, వాలెం చెన్నకేశవులు, ఆచారి, సాయి పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాచర్ల మండల జనసేన నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి దివ్యాంగ విద్యార్థులకు పంచిపెట్టారు. నిత్యవసర వస్తువులను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో రాచర్ల మండల జనసేన నాయకులు గోపాల్, శంకర్‌నాయుడు, పుల్లారావు, రవితేజ పాల్గొన్నారు.



దివ్యాంగుల మధ్య కేకు కట్ చేస్తున్న జనసేన నేతలు

పెద్దదోర్నాల : స్థానిక శివసదన్‌లో జనసేన జయకేతనం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షులు కేతి మురళి అధ్యక్షతన నిర్వహించిన వేడుక ల్లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలి పారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ భారీ నుంచి బయట పడేందుకు టీడీపీతో జనసేన జత కట్టడం చారిత్రాత్మకమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసేందుకు అందరమూ కలిసి నడుద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు గుర్రాల ప్రసాద్ రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం



కల్యాణ వేడుకల్లో రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారి తిరునక్షత్ర మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో రాజ్యలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారి మహిళా సేవా సంఘం, లక్ష్మీ చెన్నకేశవ స్వామి వికాస తరంగిణి సభ్యులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు సిబ్బంది పర్యవేక్షించారు.

ఉత్సాహంగా గిరి ప్రదక్షిణం

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు వైపు మెట్ల నుండి ప్రదక్షిణం ప్రారంభించారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని కొలుకుల గ్రామంలో ఈ నెల 16, 17వ తేదీలలో గంగాపార్వతి సమేత మలేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యులు యక్కలి రాఘవులు తెలిపారు. అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతి పుంజు హరిద్వార్ వారి అధ్వర్యంలో 108 కుండి జ్ఞాన గాయత్రి మహాయజ్ఞ హోమం 432 మంది దంపతులతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వైభవంగా రథోత్సవం

గిద్దలూరు టౌన్ : మండలంలోని నరవ గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి రథం లాగారు. ఈవో శ్రీనివాసులు, దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ చెన్నకేశవరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్ర మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం గణపతి హోమం అనంతరం చందన, కుంకుమ, తేనె, పాలు, పెరుగు, వివిధ సుగంధద్రవ్యాల అభిషేకాలు నిర్వహించారు. మధ్యా హ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం కల్పించారు.

కొమరోలు : మండలంలోని అల్లీనగరం గ్రామ పంచాయతీ లోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వెలసిన భూదేవి శ్రీదేవి సమేత శ్రీతిరుమలనాథ స్వామి దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో శుక్రవారం ఉదయం స్వామి వారికి చతుర్థ స్నానార్చన, వరుణ యాగం, 9గంటలకు నవకలశ స్నాపము, సాయంత్రం మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, మహాకుంభప్రోక్షణ, ధన్వంతరీ పూజలను భక్తిశ్రద్ధలతో వేదపండితులు చరుకుపల్లి మునీంద్రశర్మతో నిర్వహించారు. దేవస్థానానికి అవసరమైన వనరులను తాను సమకూరుస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రకాశం, కడప జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.






గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు, రథం లాగుతున్న అశోక్‌రెడ్డి దంపతులు, మార్కాపురంలో విశేష అలంకరణలో అయ్యప్పస్వామి మూలవిరాట్, హాజరైన భక్తులు

ముఖాముఖి

నిధులు లేక ఆగిన నిర్మాణాలు

జె.సుబ్బారావు, ఎంఈవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో నాడు, నేడు పనులు నిలిచిపోయాయా?

జవాబు: మండలంలో నాడు - నేడు పథకం ద్వారా పలు పాఠశాలలకు అదనపు గదులు, ప్రహరీ గోడలు మంజూరయ్యాయి. నిధులు లేకపోవటంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం నుంచి నిధులు వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

ప్ర: మండలంలో ఎన్ని యూపీ పాఠశాలలు హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ అవుతున్నాయి?

జ: మండలంలో యూపీ స్కూల్‌గా ఉన్న శంకరాపురం, సుంకరవారిపాలెం, పెదఉల్లగల్లు, సింగనపాలెం హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ అయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు తరగతులు జరగనున్నాయి.

ప్ర: మండలంలో ఈఏడాది పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతపై ఎలాంటి ప్రణాళికలు రచించారు?

జ: మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుంచి ఈనెల 17 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు 480 మంది పరీక్షలు రాస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా చదివిస్తున్నాం.

ప్ర: మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఎన్ని నిర్వహిస్తున్నారు?

జ: మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఏపీ మోడల్ స్కూల్, ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలుగా ఏర్పడ్డాయి.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి

తాళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీలు, యూపీఐ పేమెంట్స్‌పై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ మేనేజర్ మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తూర్పు గంగవరంలో శుక్రవారం యూపీఐ పేమెంట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ స్వయంగా ఖాతాదారుల వద్దకు వెళ్లి యాప్‌ల వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. ఇప్పటివరకు 120మంది ఖాతాదారులకు అవగాహన కల్గించి యాప్ యాక్టివ్ చేసినట్టు చెప్పారు. మరో 80 మందికి యాప్ యాక్టివ్ చేసేందుకు ఖాతాదారులకు అవగాహన కల్గిస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరునాళ్ల

దొనకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కరుణించమ్మా.. కనకదుర్గమ్మ అంటూ అమ్మవారిని వేడుకుంటూ భక్తులు ఉత్సవంలోపాల్గొన్నారు. ధర్మకర్త ధనివేలు ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు, సామూహిక కుంకుమ పూజలు, ప్రసాద వినియోగం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

టీడీపీ ఫ్లెక్సీల చించివేత

దొనకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దొనకొండలో టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి చించివేశారు. శుక్రవారం జరిగే కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌కు స్వాగతం పలుకుతూ ఆపార్టీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, మోడి ఆంజనేయులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. గుర్తు తెలియని ఫ్లెక్సీలను చించివేసిన విషయం శుక్రవారం ఉదయం గుర్తించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారకులపై తగిన చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

పీసీపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన మూడింటిని ప్రధాన ద్వారానికి లోపల ఒకటి, వెలుపల మరొకటి అమర్చారు. మూడో కెమెరాను రికార్డు గది, కంప్యూటర్ గది కవర్ అయ్యేలా ఏర్పాటుచేశారు. మరో రెండు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

నువ్వులో మెలకువలు పాటించాలి

తాళ్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నువ్వు సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి బిప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం తాళ్లూరు-1 రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశమయ్యారు. ఏవో మాట్లాడుతూ నువ్వులో రకాలు, మేలైన నేలలు, నీటియాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

మేజర్లకు చేరని సాగర్ జలాలు

- చుక్కనీరులేని కరవది, రజానగరం కాలువలు
- ఎండుతున్న పైర్లు
- ఆందోళన చెందుతున్న రైతులు

తాళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువలకు సాగర్ జలాలు అందడంలేదు. దీంతో కళ్లముందే పైర్లు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరవది, రజానగరం మేజర్ కాలువలకు సాగర్ జలాలు రావడంలేదు. ఈఏడాది వర్షాలు అధికంగా కురియటంతో సాగర్ జలాలు సంవృద్ధిగా విడుదల చేస్తారన్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. సాగర్ జలాలను అధికార యంత్రాంగం ఒక క్రమపద్ధతిలో విడుదల చేయడంలేదు. గతనెలవరకు విడుదల చేయటంతో వాగులు, వంకలు నిత్యం ప్రవహించాయి. దీంతో రైతాంగం సాగర్ జలాలపై ఆధారపడి సాగుకు ఉపక్రమించారు. చేతికందే సమయంలో సాగర్ జలాలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ జలాలను నమ్ముకుని వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారు. చేతికొచ్చే సమయంలో నీరు అందకుంటే పంటలు నిలువుగా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లు తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీరు లేని కరవది మేజర్ కాలువ

కరవది మేజర్‌కు 280 క్యూసెక్కులు, రజానగరం మేజర్‌కు 270 క్యూసెక్కులు రావాల్సి ఉంది. అయితే, తక్కువ మోతాదులో విడుదల అవటంతో ఆయకట్టు చివరి పొలాలకు నీరు అందటం లేదు. ఆమేజర్ల చివరి ఆయకట్టులో తాళ్లూరు మండలంలోని గ్రామాలు, సమీప గ్రామమైన ఇలపావులూరు, తదితర గ్రామాల్లో ఆరుతడి పంటలకు నీరు అందకుంటే తమ పరిస్థితి అగమ్యగోచరమవుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో 12 వేల ఎకరాల్లో పలురకాల పంటలు సాగులో ఉన్నాయి. వరితో పాటు మిర్చి, పొగాకు, ప్రత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. సాగర్ జలాలు సరఫరా కాక పోవటంతో రైతాంగం వ్యయప్రయాసలకోర్చి వాగులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీటిని దూరప్రాంతాల నుంచి ఇంజన్లద్వారా తరలించి ఆరుతడి పంటను కాపాడుకుంటున్నారు. పొట్టదశలో ఉన్న వరి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పిచ్చిచెట్లతో మూసుకుపోయిన రజానగరం మేజర్ కాలువ

రైతాంగాన్ని ఆదుకోవాలి

- మారం వెంకటరెడ్డి, కొత్తపాలెం



కరవది మేజర్‌కు చుక్కనీరు విడుదల చేయలేదు. మేజర్‌కింద సాగుచేస్తున్న వరి పొట్టదశలో ఉంది. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాం. పైరుకు నీరందక ఎండిపోతున్నది. కరవది మేజర్‌కు సాగర్ జలాలను విడుదలచేసి ఆదుకోవాలి.

నీరందక నువ్వు ఎండిపోతుంది

- చెరుకూరి వెంకటేశ్వర్లు, శివరాంపురం



సాగర్ జలాలపై ఆధారపడి మూడు ఎకరాల్లో నువ్వు పంట వేశాను. పంట చేతికొచ్చేదశలో నీరు విడుదల కాలేదు. అధికారులు ముందస్తు ఆలోచనలేకుండా సాగర్ జలాలను వృథాగా వదిలారు. పంటకు నీరు అవసరమైన సమయంలో నీరు విడుదల చేయలేదు. దీంతో ఎండు ముఖం పట్టింది. పంటను కాపాడుకోవటం కోసం తిప్పలు పడాల్సి వస్తుంది.

అగ్గి రేగితే.. అంతే సంగతులు

- కనిగిరి అగ్నిమాపక కేంద్రంలో ఒకటే వాహనం
- ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే ఆస్తులు కోల్పోవాల్సిందే!
- చాలీచాలని సిబ్బందితో ఇబ్బందులు

కనిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గం కేంద్రంలో అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఉన్న ఫైర్ ఇంజన్ కేవలం ఒక్కటే ఉంది. దీంతో నియోజకవర్గంలోని పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినపుడు కనిగిరి నుంచి ఫైర్ ఇంజన్ వెళ్లేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగుచూశాయి.

కనిగిరి ప్రాంతంలో అత్యధికంగా పొగాకు బ్యారెన్‌లు ఉన్నాయి. పొగాకు కాల్చు సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో సరైన సమయానికి ఫైర్ సిబ్బంది, అధికారులు చేరుకోవటంలో జాప్యం జరుగుతుంది. ఒకేసారి రెండుచోట్ల ప్రమాదాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హనమంతునిపాడు మండల పరిధిలో అగ్నిప్రమాదం జరిగితే కంభం నుంచి, పీసీపల్లి, పామూరు ప్రాంతాల్లో అయితే కందుకూరు, దర్శి ప్రాంతం నుంచి అభ్యర్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కనిగిరి అగ్నిమాపక కేంద్రంలో ఉన్న ఒకేఒక వాహనం

సీఎస్‌పురం మండలంలోని అంబవరం కొత్తపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కి చెందిన కందిచేను, వెలిగండ్ల మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మారం సుబ్బారెడ్డికి చెందిన పొగాకు బ్యారెన్‌లు గత నెలలో ఒకేసారి దగ్ధమయ్యాయి. మొదటిగా సీఎస్‌పురం మండలంలో మంటలను అదుపు చేస్తుండగా వెలిగండ్ల మండలంలో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఫైర్ ఇంజన్ రావటం ఆలస్యమై రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది.

వేసవికాలంలో నీటికోసం ఇబ్బంది

కనిగిరి ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి నీటికోసం ఇబ్బందిగా మారింది. కనిగిరి ఫైర్ స్టేషన్‌లో ఉన్న బోరు నుంచి ఫైర్‌ఇంజన్‌కు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుతారు. ప్రమాదం సమయంలో ఎక్కడికైనా వాహనం వెళితే అక్కడ నీరు అయిపోతే తిరిగి కనిగిరి రావాల్సిన పరిస్థితి ఉంది.

పామూరు, సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు మండలాల్లో ప్రత్యేకంగా అగ్నిమాపక తశాఖకు బోరు పాయింట్‌లు ఏర్పాటుచేయాల్సి ఉంది. అదనంగా మరో ఫైర్ ఇంజన్ అవసరం ఎంతో ఉంది. చాలీనంత సిబ్బంది కూడాలేరు.

జర్నలిస్టుల హక్కుల సాధనకోసం నిరంతర పోరాటం

- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

దర్శి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఏపీయూడబ్ల్యూజే నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. శుక్రవారం దర్శిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన అక్రిడియేషన్ కార్డులు, నివేశ స్థలాల కోసం కూటమి ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని పలువురు సభ్యులు తీర్మానించగా కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లా తీర్మానాన్ని రాష్ట్ర కమిటీకి పంపిస్తున్నట్టు ఐవీ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి డి.కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు పి.వెంకటరావు, కార్యదర్శి ఈ.శంకర్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏ.సురేష్, జి.కాశీరావు, అశోక్, శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మెటల్ వేశారు.. తారురోడ్డు మరిచారు

- గంగన్నపాలెం - మారెళ్ళ రహదారి దుస్థితి
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

ముండ్లమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపాలెం-మారెళ్ళ రహదారి అధ్వానంగా ఉంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని తారు రోడ్డుగా మార్చేందుకు రూ.90 లక్షలు మంజూరయ్యాయి. 1.4 కిలో మీటర్లు తారు రోడ్డు వేసేందుకు 2018లో ఇవి మంజూరయ్యాయి. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొదటిగా రోడ్డును చదువును చేసి మెటల్ తోలారు. ఆతరువాత అసెంబ్లీ ఎన్నికలు రావటం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు వదిలివేసి వెళ్ళారు. ఆతరువాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గంగన్నపాలెం నుంచి మారెళ్ళ వెళ్ళే వాహన చోదకులు, ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. కంకర లేచి పలుచోట్ల గుంతలు పడటంతో ఆరహదారిపై ప్రయాణం అంటేనే భయపడుతున్నారు.



మెటల్ వేసి అర్ధంతరంగా వదిలేసిన గంగన్నపాలెం- మారెళ్ళ రోడ్డు

మారెళ్ళ నుంచి మారెళ్ళ, జమ్ములమడక, మక్కెనవారిపాలెం, పూరిమెట్ల, ఈదర, భీమవరం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అద్దంకి వెళ్లేందుకు ఈమార్గంలోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన రహదారిలో మెటల్ వేసి వదిలి వేయటంతో కష్టాలు తప్పటం లేదు. నూజెండ్లపల్లి నుంచి పూరిమెట్ల వరకు తారు రోడ్డు నిర్మించి, గంగన్నపాలెం నుంచి మారెళ్ళ వరకు వదిలివేశారు. సంబంధిత అధికారులు స్పందించి 1.4 కిలోమీటర్ల మెటల్ రోడ్డును తారు రోడ్డుగా నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మేత కోసం మూగ జీవాలు వలస

ముండ్లమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కడుపు నింపు కొనేందుకు ఉన్న ప్రాంతంలో పశుగ్రాసం లేకపోవటంతో సుదూర ప్రాంతమైన బాపట్ల జిల్లా రేపల్లెకు మూగజీవాలైన ఆవులు తోలుకొని యజమానులు శుక్రవారం వలస వెళ్ళారు. పుల్లలచెరువు నుంచి రేపల్లెకు ముండ్లమూరు మీదుగా వెళుతుండగా ఆంధ్రజ్యోతికి కన్పించాయి.

ఎండాకాలం ప్రారంభం కావటంతోనే పశుగ్రాసానికి తిప్పలు తప్పటం లేదని ఈసందర్భంగా యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలను పస్తులతో ఉంచలేక మేత దొరికే రేపల్లె ప్రాంతానికి తోలుకెళుతున్నట్టు వారు తెలిపారు. బుధవారం పుల్లలచెరువు నుంచి బయలుదేరి శుక్రవారానికి ముండ్లమూరుకు చేరుకున్నాయి.



మేత కోసం వలస వెళ్తున్న ఆవులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సతీష్ బాబు

ప్లాస్టిక్ రహిత మండలంగా కురిచేడు

కురిచేడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కురిచేడును ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో సతీష్ బాబు కోరారు. శుక్రవారం ఉదయం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్లాస్టిక్ సంచులు అమ్మకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు ఆవుల లక్ష్మీదేవి మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం నిధులను ఏ పనులు చేయకుండానే స్వాహా చేశారన్నారు. వాటి లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. మండలంలో మంచినీటి పథకం పనులు పూర్తికాకుండా జడ్పీటీసీ సభ్యుడు నుసుం వెంకటనాగిరెడ్డి నాన్చుతున్నాడని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్ బాబు అన్నారు. దీనిని నాగిరెడ్డి తప్పుపట్టారు. పనులు కాకుండా ఏఈనే అడ్డుకుంటున్నాడని, నా తప్పేమి లేదన్నారు. ఈవిషయమై సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమావేశంలో ఎంపీటీసి సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, తదితరులు

కనిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కపిల లాడ్జి వద్ద మురుగు కాల్వల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పారిశుధ్య పనులు చేయించారు. కాల్వలో ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్ళు కవర్లు అడ్డుపడటంతో ప్రధాన రోడ్డుపైకి మురికినీరు చేరుతుండటంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని సూచించారు. ప్లాస్టిక్ వలన పర్యావరణానికి కూడా ఎంతో ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణం అందిస్తేనే వారి మనుగడకు ఎంతో మేలవుతుందన్నారు. నేడు ప్లాస్టిక్ వాడకంవల్ల భవిష్యత్‌కు ఎంతో ప్రమాదకరంగా మారనుందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధానికి పూనుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, శానిటేషన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు రక్ష



శక్తి యాప్ లోగోను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐలు

కనిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను పొందు పరచుకోవాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్‌ఐ శ్రీరాం మహిళా పోలీసులకు యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం, అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సందర్భంలో అయినా ఇబ్బందులకు, టీజింగ్, అసభ్యకరమైన విధానాలకు గురైనా శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించవచ్చునని చెప్పారు. ఆసమయంలో పోలీసులు సంఘటనాస్థలికి చేరకుని రక్షణ కల్పిస్తారని తెలిపారు. బాలికలు, యువతులు కూడా ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ



రంగులు చల్లుకుని హోలీ సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

కనిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను శుక్రవారం ప్రజలు ఆనందోత్సాహలతో జరుపుకున్నారు. హోలీ పౌర్ణమి ఈ సంవత్సరం శుక్రవారం రావటం మరింత విశేషాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచే పట్టణంలోని చిన్నా, పెద్దా రంగుల చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో హోలీ వేడుకలను శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుండి చిన్నారులు రంగు రంగుల నీళ్ల ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సందడి చేశారు. దీంతో పలు వీధులు రంగులమయమయ్యాయి. పలువురు యువకులు, పెద్దలు సహితం రంగులు పూసుకొని ఒకరినొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

దొనకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనకదుర్గమ్మ దేవాలయంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో శాసనసభ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గుట్టమీదపల్లి గ్రామస్తులు నిర్వహించిన పాటకచేరి కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ కనకదుర్గమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జీవీ ఆంజనేయులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

3

శనివారం 15 మార్చి 2025





హోలీ.. ఆనందాల కేళి

రంగుల పండుగ హోలీ.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఆడిపాడారు.

- గుంటూరు(తూర్పు)



భక్తుల కోసం సిద్ధం చేసిన గ్యాలరీలు



భక్తులకు అందించటానికి పసుపు, కుంకుమ, పసుపు, దారం ప్యాకెట్‌లను సిద్ధం చేస్తున్న సేవకులు

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

శ్రీవారి కల్యాణోత్సవానికి రాజధాని అమరావతిలోని వెంకటపాలెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు.

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

సమస్యల వలయంలో టిడ్కోలు

- నివాసానికి ఇష్టపడని లబ్ధిదారులు
- వసతుల కల్పనపై అధికారులు మీనమేషాలు
- తాగునీటికి కటకట..డ్రెయినేజి అధ్వానం.. అపరిశుభ్రత
- నాడు హడావుడి గృహ ప్రవేశాలు.. నేడుపట్టించుకోని పాలకులు



అద్దంకి : శింగరకొండ సమీపంలో అసంపూర్తి పనులతో నిలిచిన టిడ్కో ఇళ్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎనిమిదేళ్లకుపైగా నిరీక్షణకు తెరపడి ఇళ్లల్లో చేరినా.. ఆ ఆనందం ఆవిరైపోతోంది. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించగా వైసీపీ వాటిని పాడుపెట్టి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల చేత హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. అయితే కనీస సౌకర్యాలు సమకూర్చకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం నాటి పాలకులు లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వగా ప్రస్తుతం వాటి పరిష్కారంపై పాలకులు దృష్టి సారించడంలేదు. తాగు నీటి, డ్రెయినేజి, అపరిశుభ్రత, విద్యుత్, రవా ణా తదితర సమస్యల్లో టిడ్కో ప్రాంగ ణాలు నిండిపోయాయి. వందల సంఖ్యలో గృహస్తులు ఉంటున్నా తాగునీరు అంతంత మాత్రంగా సరఫరా చేస్తు న్నారు. దీంతో తాగునీటితో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని చోట్ల అయితే సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు టిడ్కో ఇళ్లల్లో ఉండేందుకు ముందుకు రావడం లేదు. టిడ్కో ఇళ్లల్లో లబ్దిదారులు ఎందుకు ఉండటం లేదు.. అక్కడ నెలకొన్న సమస్యలు ఏమిటి.. ఇంకేమైనా సదు పాయాలు కల్పించాలా.. అన్న ఆలోచన కూడా అధికారు లు చేయడంలేదు. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నా టిడ్కో ప్రాంగ ణాల్లోని సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.

భయం.. భయం

తెనాలి సమీపంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో ప్రాంగణంలో ఇటీవల ఓ గృహంలో విషసర్పం ప్రవేశించి గృహిణిని కాటు వేసింది. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కాటు వేసిన ప్రాంతం నుంచి విషం పైకి పాకకుండా తాడుతో కట్టుకట్టుకుని భర్త సాయంతో దాదాపుగా 6 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్న పరిస్థితి. ఈ పరిణామంతో ఇక్కడ లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో నివాసానికి సాహసించడంలేదు. ఇదే పరిస్థితి గృహ ప్రవేశాలు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ నెలకొంది. అపరిశుభ్రత కారణంగా దోమలతో ప్రజలు పగలు కూడా అల్లాడి పోతున్నారు. గుంటూరు అడవితక్కెళ్లపాడులో గత వైసీపీ ప్రభుత్వం కల్పించిన విద్యుత్ సదుపాయాలు నాసిరకంగా ఉండటంతో భూగర్భంలోని వైర్లు తెగి ప్రాణాంతకంగా మారుతుండటంతో మంటలు రేగి ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో లబ్ధిదారులు భయం భయంగా ఉంటున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని దొండపాడులోని టిడ్కో ప్రాంగణం చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.



తెనాలి టిడ్కో గృహాల్లో పాము కాటుకు గురైన మహిళ

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాల్లో పేదల అద్దె ఇళ్ల కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపల్ కేంద్రాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగి గృహ ప్రవేశాలకు సిద్ధమవగా 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల ఆశలు ఆవిరై పోయాయి. కళ్లెదుట ఇళ్లు కనిపిస్తున్నా వాటిని వైసీపీ పాలకులు 2024 ఎన్నికల ముందు వరకు పాడుపెట్టారు. లబ్ధిదారులు, ప్రతిపక్షాలు ఎన్ని ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్ల గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయరన్న ఉద్దేశంతో హడావిడిగా టిడ్కో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. దీంతో 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా, సీఆర్డీఏ సహా 12 పట్టణాల్లో 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 22,068 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే పెండింగ్ పనులు చేపట్టకుండా రంగులు వేసి ఇళ్ల తాళాలను నాడు వైసీపీ హయాంలో అప్పగించారు. గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేట, మంగళగిరి, సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లల్లో చేరారు. అయితే తాము చేరిన ఇళ్లు రంగులు మయంగా కనిపిస్తున్నాయే కానీ అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజి, అపరిశుభ్రత, రవాణా సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఆయా ఇళ్లల్లో ఉండలేక గత ఏడాదిన్నరకు పైగా లబ్ధిదారులు అల్లాడుతున్నారు. గృహప్రవేశాలతో బాధ్యత ముగిసిందన్నట్లు నాడు వైసీపీ హయాంలో అధికారులు వ్యవహరించగా నేడూ అదే తీరు ఈ ప్రభుత్వంలోనూ నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా, చెత్తాచెదారాల తొలగింపు లేక, అత్యవసరమైతే వైద్యం, పిల్లల చదువులకు పాఠశాలలు, రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూస్తున్నా పది నెలలుగా (మిగతా 4వ పేజీలో)



రేపల్లెలో టిడ్కో గృహాల దుస్థితి



గుంటూరులోని టిడ్కో ఇళ్లపై నిర్మించిన నీళ్ల ట్యాంకులు



అధికారులు సరఫరా చేస్తున్న మురుగు నీరు..

గుంటూరులో గంటే.. అదీ మురుగునీరు

గుంటూరు అడవితక్కెళ్లపాడులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందక అల్లాడుతున్నారు. 4,192 కుటుంబాలకు రోజుకు ఒక్క గంట మాత్రమే నీరు వదులుతున్నారు. పదహారు ప్లాట్లకు ఒక నీళ్ల ట్యాంకు నిర్మించగా, 6 అడుగుల లోతులో ఉండే ఆ ట్యాంకుల్లో రెండడుగులకు మించి నిండటంలేదు. ఆ నీరు కూడా ఉపయోగించుకోవడానికి వీలుగా లేకుండా మురికిగా వస్తున్నాయి. దీంతో ప్రజలు దగ్గరలోని స్వర్ణభారతినగర్‌కు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.

సమస్యలు ఇలా..

- డ్రెయినేజ్‌ల నిర్వహణాలోపంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి సమస్యగా మారింది.
- రేషన్ సరుకులు అందించేందుకు ఎండీయూ వాహనాలు సైతం రాని పరిస్థితి.
- పారిశుధ్య పనులు చేసే సిబ్బంది కూడా నిత్యం రాకపోవడంతో టిడ్కో ప్రాంగణాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది.
- టిడ్కో గృహసముదాయాల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడివినితలపిస్తున్నాయి. దోమలు, విషసర్పాలతో ఆందోళన చెందుతున్నారు.
- నాసిరకం విద్యుత్ వైర్లు కారణంగా ఇళ్లలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంటూరులో అయితే వైర్లు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి.

సాగుకు.. యంత్ర సాయం

- జిల్లాకు రూ.2.85 కోట్లు.. 1719 పరికరాలు పంపిణీ
- రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సేద్యానికి సాంకేతిక సహకారం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు రాయతీపై వ్యవసాయ యంత్రపరికరాలు అందించేందుకు నిధులు విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియను కూడా మొదలుపెడుతున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. త్వరలోనే యంత్ర పరికరాలను రైతులకు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యా యం జరగకుండా, పారదర్శకంగా ఈ పథకాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించే ప్రక్రియను గత వైసీపీ పాలకులు అస్తవ్యస్తం చేయగా ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా మార్గదర్శకాలను రూపొందించింది. 2014--19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం సేద్యంలో యాంత్రీకరణను ప్రవేశపెట్టాలనే దిశగా లక్ష్యాలు రూపొందించుకుని అడుగులేసింది. ఆ తర్వాత గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలతో ఈ పథకాన్ని అధోగతి పాల్జేసింది. అంతా కలిపి గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సేద్యానికి అవసరమయ్యే పరికరాలపై పెట్టిన ఖర్చు రూ.18 కోట్లకు మించలేదు.



నిధుల కేటాయింపు ఇలా...

బాపట్ల జిల్లాకు 1719 వ్యవసాయ పరికరాలను రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకు రూ.2.85 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. గుంటూరు జిల్లాకు వచ్చేసరికి 1727 పనిముట్లకు రూ.2.91 కోట్లను ప్రభుత్వం కేటాయించగా, పల్నాడు జిల్లాకు రూ.2.80 కోట్లు ఖర్చు చేసి 1715 పరికాలను రైతులకు అందించే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాయితీపై అందించే పనిముట్లలో ట్రాక్టర్, డ్రోన్ ఇంప్లిమెంట్స్ స్ప్రేయర్లతో పాటు రోటావేటర్లు, పవర్ వీడర్లు ఇతరత్రా కూడా ఉన్నాయి. పరికరాలు కావాలనుకునే రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని ఆయా మండలాల పరిధిలోని వ్యవసాయ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేసి, క్షేత్రస్థాయిలో దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతలపై వివరాలు సేకరించి అర్హుల జాబితాను రూపొందిస్తారు. ఆ జాబితాను జిల్లా స్థాయిలో నివేదించి తర్వాత తుది ప్రక్రియ దిశగా అడుగులేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను రెండు వారాల్లోగానే పూర్తి చేసి లబ్ధిదారులకు పరికరాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తే..

ప్రభుత్వం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు యంత్రపరికరాలను రాయితీకి అందించేందుకు రూ.8.56 కోట్లు విడుదల చేసింది. దరఖాస్తుల ప్రక్రియ ముగిసేసరికి మార్గదర్శకాలలో తెలిపిన పనిముట్లలో వేటికి ఎక్కువ మంది రైతులు ఆశ చూపితే వాటి కేటాయింపుల విషయంలో స్వల్ప మార్పుల ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాల వారీగా అందించే పనిముట్ల సంఖ్యను కూడా ప్రభుత్వం ప్రకటించింది. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 25,000 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు పంపి మలిదశ నిధులు కూడా దక్కేలా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అభివృద్ధి పనులకు.. రూ.25.65 కోట్లు

- న్యూగుంటూరు స్టేషన్‌లో సిగ్నలింగ్, టెలికం వర్కులు
- వేమూరులో గూడ్స్ షెడ్, కృష్ణాకెనాల్-మంగళగిరి మధ్య పైపులైను

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు రైల్వే శాఖ టెండర్లు పిలిచింది. ఆయా పనులకు రూ.25.65 కోట్లు కేటాయించగా త్వరలోనే ప్రారంభించబోతుంది. వేమూరు రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌షెడ్డు ఏర్పాటు కానున్నది. న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలకు తలెత్తుతున్న ప్రతిబంధకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ అభివృద్ధి చేయనున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కృష్ణాకెనాల్ - గుంటూరు వాటర్ పైపులైను పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర ప్రాంతాల్లోని రైతులకు వారి పంట ఉత్పత్తులు రవాణాకు సరైన సదుపాయాలు లేవు. తెనాలి రైల్వేస్టేషన్‌కు/రోడ్డు మార్గంలో రవాణా చేసుకోవాల్సి వస్తున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు గుంటూరు రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైల్వే శాఖ వేమూరు క్రాసింగ్ రైల్వేస్టేషన్‌లో ఒక గూడ్స్ షెడ్డుని అభివృద్ధి చేయాలని నిర్ణయించి రూ.9.98 కోట్ల కేటాయించింది. కృష్ణానది నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వరకు పదేళ్ల క్రితమే మంజూరైన తాగునీటి పైపులైను పనులు పెండింగ్లఓ ఉన్నాయి. ఈ క్రమంలో కృష్ణానది వంతెనపై ఓపెన్ వెబ్ గర్డర్ నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరు చేయడంతో రైల్వే శాఖ టెండర్లను పిలిచింది. గుంటూరు - న్యూగుంటూరు/రెడ్డిపాలెం మధ్య టవర్ కార్ రాకపోకలకు, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్డు 4, 5 లైన్ల నుంచి తెనాలి వైపునకు గూడ్స్ రైళ్ల రాకపోకలకు వీలుగా అవసరమైన సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ చేపట్టడానికి రూ.12.7 కోట్ల అంచనాతో టెండర్ల ప్రక్రియని రైల్వే శాఖ చేపట్టింది.

ధాన్యం సేకరణ.. నేటితో ముగింపు

- 91,560 టన్నుల ధాన్యం మద్దతుధరకు కొనుగోలు
- రూ.212 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ
- రబీ సీజన్ కొనుగోళ్లకు సన్నద్ధమవుతున్న యంత్రాంగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ఘట్టం నేటితో ముగుస్తోంది. ఖరీఫ్ సీజన్ లో మొత్తం 91,560 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించారు. 14,259 మంది రైతులకు మద్దతు ధర ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చగా రూ.212 కోట్లను రైతాంగం ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ సారి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే అన్న దాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా అన్ని చర్యలు చేపట్టింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు శనివారంతో ముగుస్తుండడంతో రబీ సీజన్‌పై యంత్రాంగం దృష్టి సారించింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు తెరిచే విధంగా సన్నాహాలను అధికారులు ప్రారంభించారు

రబీ సీజన్ ప్రతిపాదనలు భారీగానే...

ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రభుత్వం తొలుత ఇచ్చిన 50,000 టన్నుల లక్ష్యం సరిపోక పలు దఫాలుగా ప్రతిపాదనలు పంపి ఆమోదం తెచ్చుకోవడం కోసం శ్రమించాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. రబీ సీజన్‌లో అలాంటి పరిస్థితి ఉత్పన్నమవకుండా పెద్ద ఎత్తున దిగుబడులు వచ్చే అవకాశం ఉండడంతో మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ప్రతిపాదనలను లక్ష టన్నుల వరకు పంపనున్నారు. రబీసీజన్ విషయంలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లతో సిద్ధమవుతున్నామని ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నామని సివిల్ సప్లయిస్ విభాగం చెబుతోంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (శనివారం)

సహరి : 4.59 (ఆదివారం)

అట్టహాసంగా.. శింగరకొండ తిరునాళ్ల

- వైభవంగా రథోత్సవం.. తరలివచ్చిన భక్తులు
- సందిరెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో 25వ ఏట ప్రభ

అద్దంకి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి 70వ వార్షిక తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ముగిశాయి. బుధవారం ఉత్సవాలు ప్రారంభం కాగా చివరి రోజు శుక్రవా రం ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవాలయాలతో పాటు శింగరకొండ క్షేత్రం విద్యుత్ దీపాల వెలుగులతో నిండిపోయింది. భక్తులు స్వామి వార్ల దర్శనానికి పోటెత్తారు. క్యూలు భక్తులతో కిటకిట లాడాయి. శుక్రవారం రాత్రి జరిగిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవాన్ని తిలకించారు.

తిరునాళ్లకు ఐదు ప్రభలు..

శింగరకొండ తిరునాళ్లకు 5 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభలపై వెలుగులు ప్రత్యేక ఆకర్షణ గా ఉన్నాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. శింగరకొండపాలేనికి చెందిన టీడీపీ నేతలు రెండు, అద్దంకి పట్టణం నుంచి ఒక ప్రభను ఏర్పాటు చేశారు. టీడీపీ నేత సందిరెడ్డి రమేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో 25వ ఏట ప్రభ ఏర్పాటు చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలతో ఆ ప్రాంతం పసుపుమయంగా మారింది. భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) ప్రభను ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ సందర్శించి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. వైసీపీ నేతలు ప్రభలు ఏర్పాటు చేయకుండా ముఖం చాటేయడంతో ఆపార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు.

ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి





విద్యుత్ వెలుగులలో శింగరకొండ క్షేత్రం

జాతీయస్థాయిలో పీవీఆర్ విద్యార్థిని ప్రతిభ


ట్రోఫీతో ఆముక్త

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల విద్యార్థిని ఆముక్త జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలలో సత్తా చాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆముక్త ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 22వ జాతీయ స్థాయి మహిళా చాంపియన్‌షిప్ పోటీలలో అండర్-13 విభాగంలో ఆంధ్రజట్టు తరుఫున పోటీల తలపడి కాంస్య పతకాన్ని సాధించారు. జనవరిలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో పదమూడేళ్ళ వయస్సు ఓపెన్ విభాగంలో ప్రపంచ స్థాయిలో 11వ స్థానంలో నిలవగా, తాజాగా జరిగిన పోటీలలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు చాటారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో కిరణ్‌కుమార్, ఆముక్తను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆగని జామాయిల్ అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ అక్రమ రవాణా ఆగడం లేదు. తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి యథేచ్ఛగా జామాయిల్ కర్రను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటు న్నారు. మండలంలోని పెదరాజుపాలెం పంచాయతీ పరిదిలోని నలజనంపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటలను అక్రమంగా నరికి లారీల ద్వారా తరలిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యారు. నలజనంపాడులోని సర్వే నెంబర్లు 204/2, 204/3,205/2,205/3లో గల అగ్రిగోల్డ్ సంస్థ జామాయిల్ తోటలను సాగుచేసింది. గత రెండు రోజుల నుంచి లింగసముద్రం మండలానికి చెందిన ఓవ్యక్తి కర్రను తరలిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. గతంలో అగ్రిగోల్డ్‌కు భూములు అమ్మిన వ్యక్తి తన పేరుతో ఆ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని జామాయిల్ కర్రను తరలించుకొంటున్నాడని గ్రామస్థులు తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ సీఐడి ఆధీనంలో ఉన్నప్పటికీ జామాయిల్ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికా రులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జామాయిల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

100 మందికి కంటి వైద్యపరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంకొల్లు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టరు బాష రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు.వీరికి ఉచితంగా కారంచేడు కంటి హాస్పిటల్‌లో ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ చెప్పారు. 100 మందకి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల


రంగుల విద్యుత్ దీపాలతో ఆలయం

చినగంజాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్లను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామికి వేకువజాము నుంచే పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజారి మాజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిని పలు రకాల పూలమాలలతో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పర్చూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జనసైనికులు కూటమి నేతలతో కలసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక బొమ్మల సెంటర్‌లోని వంగవీటి మోహన్‌రంగా, ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జనసేన పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారీకేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తోట మణి, తులసి చంటి, తులసి అప్పారావు, కందా సురేంద్రబాబు, అచ్చెకోలు, ముత్యాల శ్రీనివాసరావు, బోగాది మోహన్, రంగిశెట్టి మారుతి, గోగుల శ్రీనివాసరావు, దాసరి సాంబయ్య, టీడీపీ మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, వడ్డిముక్కల అబ్రహం, నలిగిల కిషోర్ పాల్గొన్నారు.


పర్చూరులో జనసేన జండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చీరాలలో...

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు చీరాల నుంచి జన సైనికులు, వీర మహిళలు భారీగా తరలి వెళ్లారు. కార్యదర్శి గూడూరు శివరామప్రసాద్, లక్కాకుల లక్ష్మీ, కిషోర్ ఉన్నారు.

కడవకుదురులో...

చినగంజాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో నాయకులు కట్టిబోయిన సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరిబాబులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాత్రికి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా పిఠాపురంలో జరుగుతున్న ఆవిర్భావ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుర్రి వాసుదేవరావు, షేక్ జిలాని, అనంత యశ్వంత్, చందు విజయ్‌కుమార్, పూల అనిల్, కమ్మెల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మీరు ఊ.. అంటే జడ్పీ నుంచి పంపేస్తా..

నాతో సహా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు అందరిపై విచారణ జరపాలి

చంద్రబాబు, పవన్ సంయుక్తంగా కేడర్‌కు భరోసా ఇవ్వాలి

జనసేన సభలో జగన్‌పై నిప్పులు చెరిగిన బాలినేని

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'మీరు(పవన్) ఊ అంటే ప్రకాశం జిల్లా పరిషత్ పాలకమండలి నుంచి కూడా వైసీపీని తరిమేస్తాం' అని బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యాలు చర్చనీయాంశమయ్యాయి. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై మరోసారి నిప్పులు చెరిగిన మాజీ మంత్రి జిల్లాకు సంబంధించి రాజకీయంగా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి జనసేనలో చేరిన బాలినేని శుక్రవారం పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. జిల్లా సమస్యలను ఆయన ప్రస్తావిస్తూ ఒంగోలులో కార్పొరేషన్‌లో 20 మంది వైసీపీ కార్పొరేటర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు జనసేనలో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్ ఓకే అంటే జిల్లా పరిషత్‌పై పెత్తనం చేస్తున్న వైసీపీ ఛైర్‌పర్సన్‌ను కూడా గద్దె దించుతామని స్పష్టం చేశారు. కొద్దిరోజుల క్రితం మంగళగిరిలో పవన్‌ను కలిసిన బాలినేని జిల్లాలో ఆయా నియోజకవర్గాల వారీ స్థానిక సంస్థలను కూటమి పార్టీలు కైవసం చేసుకునే విధంగా వైసీపీ నుంచి జనసేనలో చేరే వారి విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్‌ల పాలకమండలి కాలపరిమితి నాలుగేళ్లు పూర్తికావడంతో వారిని అవిశ్వాస తీర్మానంతో తొలగించే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో బాలినేని తన ప్రసంగంలో జడ్పీ ఛైర్‌పర్సన్‌ను తొలగిస్తామని, జనసేన (కూటమి) పరిధిలోకి తెస్తామని అనడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో బాలినేని వ్యాఖ్యలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి.


పిఠాపురం సభలో మాట్లాడుతున్న బాలినేని

బడా నేతలపై దృష్టిపెట్టాలి

ఇదే సందర్భంలో బాలినేని వైసీపీ అధినేత జగన్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. అప్పటి ఎంపీ రఘురామకృష్ణమరాజును కొట్టించి నానాహింసలు పెట్టిన జగన్ నేడు వంశీ, పోసాని కృష్ణమురళీలను అరెస్టు చేస్తే పరామర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సాదాసీదా కార్యకర్తలను అరెస్టు చేయడం పక్కనబెట్టి వైసీపీ ప్రభుత్వంలో అవినీతితో కోట్లు సంపాదించిన బడా నేతలపై దృష్టిపెట్టి జైలుకు పంపాలని డిమండ్ చేశారు. అవసరమైతే తనతోపాటు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పాలనపై విచారణ జరపాలని కోరారు. తాను జనసేనలో చేరితే కూటమి పార్టీల మధ్య విభేదాలు వస్తాయని కొందరు ప్రచారం చేశారని, తాను పదవుల కోసం చేరలేదన్నారు. పవన్‌ను తనతో సినిమా తీసే అవకాశం మాత్రమే ఇవ్వాలని అడిగానని, తన ద్వారా కూటమి పార్టీల మధ్య విభేదాలు వచ్చే అవకాశం లేకుండా పనిచేస్తానని చెప్పారు. జగన్ చేసిన పాపాల ఫలితమే ఆయన్ను వెంటాడుతున్నాయని గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. అలాగే కొన్ని నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలు సరైన గుర్తింపు లేక ఇబ్బందిపడుతున్నారని, ఈ విషయమై చంద్రబాబు, పవన్‌లు సంయుక్తంగా సమావేశం పెట్టి ఇబ్బందులు కల్పిస్తున్న ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తూ కార్యకర్తలకు అండగా సంయుక్త ప్రకటన చేయాలని కోరారు.

శింగరకొండకు పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనం కోసం భక్తుల బారులు




లక్ష్మీనరసింహస్వామి, ధ్వజస్తంభం వద్ద పూలతో అలంకరించిన జై శ్రీరామ్

సత్రాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం

అద్దంకి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. గతంలో కంటే భిన్నంగా ఈ ఏడాది పగలు సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములను దర్శించుకున్నారు. దీంతో శింగరకొండ వద్ద శుక్రవారం ఉదయం నుంచే భక్తులు స్వామి వార్ల ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. 12వ తేదీ ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు మూడు రోజుల పాటు సాగాయి. శుక్రవారం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన పూజలు చేశారు. దేవస్థాన వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులచే మన్యుసూక్త పారాయణం, హోమం నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు స్వామి వారి దివ్య దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ధ్వజ స్తంభం వద్ద, ముఖ ద్వారం వద్ద పూలతో తెలుగు, ఇంగ్లిషు అక్షరాలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ఫెస్టివల్ ఆఫీసర్ రమణమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొండపై దేవాలయం వరకు భక్తులకు అద్దంకిలోని భవిష్య స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. అన్ని సామాజిక వర్గాల అన్నదాన సత్రాలలో భక్తులకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అంజన్న

మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ

రోటరీక్లబ్ శింగరకొండ, వాసవీ క్లబ్, వనితాక్లబ్, జువారి సిమెంట్, ఎల్ఐసీ తదితర సేవాసంస్థల ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ ప్యాకెట్‌లు, మజ్జిగ ప్యాకెట్ లు పంపిణీ చేశారు. పులిహోర పంపిణీ చేశారు.

భారీ బందోబస్తు

తిరునాళ్ల సందర్భంగా చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2 డ్రోన్‌లు, 70 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 మంది ఎస్సైలు, 650 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అద్దంకి, ఒంగోలు, వినుకొండ, నర్సరావుపేట, బాపట్ల డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్, శింగరకొండ వద్ద 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, కాకతీయ కమ్మ సత్రం వద్ద పలుసార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది.



ఇళ్లు సరే.. సౌకర్యాలు ?

(3వ పేజీ తరువాయి)

వీరి గోడు పట్టించుకున్న వారే లేరు.

- చిలకలూరిపేట చెరువురోడ్డులో 52 ఎకరాల్లో టిడ్కో సముదాయంలో వసతులు లేని కారణంగా 4,612 గృహాలకు రెండు వేల మంది కూడా నివాసం ఉండడం లేదు. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. వీధి దీపాలు, నీటి వసతి కల్పించింది. ఆస్పత్రి, పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.

- సీఆర్డీఏ పరిధిలో కృష్ణయ్యపాలెంలో టిడ్కో ఇళ్లకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేదు. కంకరతో తాత్కాలిక రోడ్డు వేసిసరిపెట్టారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇక్కడ కొంతవరకు తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరుతోంది. దొండపాడులో మందుబాబులు, జూదరుల దాడులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి.. ఊసేలేని పనులు

అమరావతి పరిధిలోని 8 ప్రాంతాల్లో 5,024 ఇళ్లు, గుంటూరు సమీపంలోని అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888, పొన్నూరులో 2,368, తెనాలిలో ఫేజ్- 1లో 848, మంగళగిరిలో 1,728, చిలకలూరిపేటలో4,512, నరసరావుపేటలో 1,504, ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు.వెంగళాయపాలెంలో ఫేజ్- 2 కింద 1,392, సత్తెనపల్లిలో 160 ఇళ్లు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయి. తెనాలిలో ఫేజ్- 2లో 1,008, చిలకలూరిపేటలో ఫేజ్- 2లో 1,008 ఇళ్లు, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056, ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అద్దంకిలో 863 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్ల ఎలాంటి పనులూ జరగలేదు. రేపల్లె మండలం అరవపల్లి సమీపం, రేపల్లెలోని రెండో వార్డులో 1373 టిడ్కో ఇళ్లు మంజూరైనా పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ఐదేళ్ల పాడుబెట్టడంతో టిడ్కో ప్రాంగణం చుట్టూ భారీఎత్తున పిచ్చిమొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి పిడుగురాళ్లలో సుమారు 4 వేలకు పైగా టిడ్కో గృహాలు మంజూరు కాగా 2018 నాటికి 2,832 గృహాల్లో సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. విద్యుత్, రోడ్లు, డ్రెయినేజి వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ గృహప్రవేశాలకు ముందుకు రాలేదు. సత్తెనపల్లిలోని భీమవరం డొంక రోడ్డులో 160 వరకు గృహాలను నిర్మించగా విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం కూడా జరగాల్సి ఉంది. మాచర్లలో 1056 టిడ్కో గృహాల పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మందుబాబులకు నిలయాలుగా మార్చుకున్నారు. వైసీపీ పాడుపెట్టిన ఇళ్లతో పాటు గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఇళ్లను చంద్రబాబు అందిస్తారని లబ్ధిదారులు పది నెలలుగా ఎదురు చూస్తున్నారు.

అవీఇవీ

ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10లక్షలు యానాదులు ఉన్నారని, వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని జాండ్రపేట కన్యకాపరమేశ్వరి మండపంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా, అభివృద్ధి పరంగా వెనుకబడి ఉన్నందున ఎస్టీల వర్గీకరణ జరగాలన్నారు. ఈక్రమంలోనే ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చేవూరు సుబ్బారావు, పెద బ్రహ్మయ్య, రాజా, హనుమంతరావు, మురళీ, చెంచయ్య కె మురళీ, సతీష్‌చంద్ర, ఉష, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

వేటపాలెం/చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా టీడీపీ సభ్యత్వ కార్డులు నమోదు చేయించినట్లు వేటపాలెం సీనియర్ నాయకులు నాపిక వీరభద్రయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామన్నపేటలో ఇటీవల నమోదు చేసుకున్న సభ్యులకు ఆయన కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌రావు, బాలచంద్ర, కృష్ణ, లింగమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దేవాలయాలపై పెరిగిన దాడులు


మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

అద్దంకి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని బీసీవై పార్టీ రా ష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ చెప్పారు. శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ఆయనపాల్గొన్న అనంతరం అద్దంకిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిందువులు జరుపుకునే పండుగలపై ఆంక్షలు పెరగటం దురదృష్టకరమన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

- మరొకరికి గాయాలు


బండారు బాబు మృతదేహం

సంగెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతి, మరొకరికి గాయాలైన సంఘటన శుక్రవారం వరంగల్ జి ల్లా సంగెం మండల కేంద్రం సమీపంలో జరిగింది. మండల కేంద్రం లో నివసిస్తున్న తాపీ మేస్త్రీ తన మిత్రుడితో కలిసి మండలంలోని తిమ్మాపురంలో పని ముగించుకొని బైక్‌పై సంగెంకు వస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరంగల్ నుంచి తిమ్మాపురం వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బండారు బాబు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదే జిల్లా ఉలవపాడు గ్రామానికి చెందిన పులగర శివమణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శివమణిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఎస్సై నరేష్ బండారు బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. బాబు భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీసీ ఫుటేజీల ద్వారా బొలెరో వాహనాన్ని గుర్తించినట్లు ఎస్సై చెప్పారు. బాబుకు ఇద్దరు పిల్లలున్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్‌పై సమరం'


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వరరావు స్థానిక దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవగాన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని తెలిపారు. అలాగే హోటల్ యాజమాన్యాల వారు ప్లాస్టిక్‌కు బదులుగా అరటి ఆకులు, ఇస్తరాకులు, సిల్వర్ కవర్లు వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రాణాంతకమైన ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం ద్వారా పశువులు మరణిస్తున్నాయని, అలాగే మనుషులు క్యాన్సర్ బారిన పడతారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్‌సేవ

సంతనూతలపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీదేవి,భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం స్వామివార్లను వేదపండితులు పరాంకుశం ప్రసాద్‌చార్యులు, పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం యాగశాలవైదిక కార్యక్రమాలను, దీపాలంకరణ, ఊంజల్‌సేవ చేశారు. తదుపరి గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.


స్వామి ఊంజలసేవలో పాల్గొన్న భక్తులు

మనస్తాపంతో వృద్ధుడు బలవన్మరణం

బుర్లవారిపాలెం(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఓ వృద్ధుడు బలవన్మరణం చెందాడు. ఈఘటన మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొంత గొర్ల చినవెంకటేశ్వర్లు(65) అలియాస్ స్వాములుకు భార్య బాపమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇతను గ్రామంలోనే ఆకు కూరలు సాగు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా అతను అనారోగ్యం బారినపడటంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వైద్యం చేయించారు. అయినా ఫలితం లేదు. దీంతో గతంలోనే ఆయన పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి దిగాడు. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహేతర సంబంధం.. దాడి.. కానిస్టేబుల్ సస్పెండ్

పేరాల(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె బంధువులపై ఘర్షణకు పాల్పడిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చీరాలకు చెందిన కానిస్టేబుల్ కొంత కాలంగా డీఎస్పీ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఇతనికి పేరాల్లోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈక్రమంలో గురువారం రాత్రి ఆమె బంధువులతో తీవ్రంగా ఘర్షణ పడి చివరకు దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో రెండు వర్గాల వారు ఏరియా హాస్పిటల్‌కు చేరి చికిత్స పొందారు. విచారణ చేపట్టిన అధికారులు అతనిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా సస్పెండ్ చేశారు.

31మందికి ఐపీ నోటీసులు పంపించిన మహిళ

యద్దనపూడి/మార్టూరు, మార్చి14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లిలో ఒక మహిళ 31 మందికి ఐపీ నోటీసులను కోర్టు ద్వారా ఇచ్చినట్లు తెలిసింది. దాదాపు 50 లక్షల రూపాయలు దాకా వారికి ఇవ్వాల్సి ఉండగా ఐపీ నోటీసులు పంపినట్లు బాధితులు తెలిపారు. ఒక్కొక్కరి దగ్గరనుంచి లక్ష నుంచి రూ. 3 లక్షలు దాకా అప్పుగా తీసుకున్నట్లు తెలిసింది. కొంతమంది పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించేపనిలో ఉన్నారు.

స్థలాలు మంజూరు చేయాలి

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న నిరాశ్రయులకు నివేశన స్థలాలు కేటాయించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి చెప్పారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మునిసిపల్ పరిధిలోని 27వ వార్డు జయశంకర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు, నాయకులు వసంతరావు, జయరాజ్, సుబ్బారావు పాల్గొన్నారు.

విలువ కోట్లు.. కానీ ఇక్కట్లు



పర్చూరు నడిబొడ్డున ప్రభుత్వానికి కోట్ల విలువ జేసే ఎకరా భూమి నిరుపయోగంగా మారింది. భూమి ఖాళీగా ఉండటంతో వర్షాకాలంలో నీరు నిల్వఉండటం, పరిసరాలలోని మురుగునీరు అందులో చేరటం వల్ల గడ్డి, ముళ్లచెట్లు పెరిగాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్ఎస్పీ శాఖకు మూడు దశాబ్దాల క్రితం 2ఎకరాల స్థలం కేటాయించారు. అందులో చిన్న భవనాన్ని కార్యాలయం కోసం నిర్మించారు. 20 సెంట్లు పంచాయితీరాజ్ సబ్‌డివిజన్ అతిథి గృహానికి కేటాయించారు. మరో 80 సెంట్ల భూమిని ఆర్‌టీసీ అవసరాల కోసం ఇచ్చారు. మిగిలిన ఎకరం భూమి ఎన్ఎస్పీ పరిధిలో ఉంది. ఈస్థలం ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో దీని విలువ సుమారు రూ.2 కోట్లపైనే పలుకుతోంది. ప్రస్తుతం ఎన్ఎస్పీ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో ప్రస్తుతం ప్రయివేట్ భవనంలో అరకొర వసతుల నడుమ ఎన్ఎస్పీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. దీంతో సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇంతటి విలువైన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవటంతోపాటు, ఎన్ఎస్పీ శాఖకు సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-పర్చూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

ఆరుతడులకు నీరు అందించేందుకు ఏలూరి కృషి

ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా కార్యాచరణ

అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలన



అడుసుమల్లి పరిధిలోని ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్చూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆరుతడులకు నీరందించి రైతాంగాన్ని ఆదుకునే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొద్దిపాటి మరమ్మతులకు కూడా నోచుకోక అనేక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవ చూపారు. దానిలో భాగంగా రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి ఉమాదేవి ఎత్తిపోతల పథకాన్ని నిర్వాహకులు అడ్డగడ వీరబ్రహ్మం, అడ్డగడ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పరిశీలించారు.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చేయాల్సిన మరమ్మతులపై ప్రతిపాదన చేశారు. అనంతరం ఇనగల్లులోని ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మువ్వా వీరయ్య, పోపూరి శ్రీనివాసరావు, అడ్డగడ శ్రీనివాసరావు, నాగరాజు, కారుమంచి శ్రీనివాసరావు, కాకాని నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

అదనపు సాయంతో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీవో బి. సింగయ్య

అద్దంకిటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందించే అదనపు సాయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పథకం సంబంధించి ఏఈ కిరణ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2019 నుండి 2024 మధ్య కాలంలో హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, డబ్బులు జమ కాక నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. అలాంటి గృహాలను సర్వే చేయాలని చెప్పారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తుందన్నారు.

పెండింగ్ గృహాలకు చక్కనైన వెసులుబాటు

వేటపాలెం(చీరాల), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గతంలో గృహ నిర్మాణాలు మధ్యలో నిలిపివేసిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించిందని మండల ప్రత్యేక అధికారి రాజా దెబోరా చెప్పారు. ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల మండలంలో..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను గ్రామాల్లో పారదర్శకంగా అమలు చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ చెప్పారు. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు మండల కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కారంచేడులో..

కారంచేడు మండల పరిధిలో పూర్తి కాని పక్కా గృహాలను గుర్తించి పూర్తయ్యేలా చర్యలు తీసుకువాలని ఎంపీడీవో నేతాజీ చెప్పారు. కారంచేడు ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిసెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

యద్దనపూడిలో...

యద్దనపూడి/మార్టూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0లో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఇళ్లు నిర్మించుకుంటూ, నిధులులేక అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తోందని మండల హౌసింగ్ ఏఈ రాహుల్ చెప్పారు. శుక్రవారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ బి ప్రకాష్‌రావు సమావేశం నిర్వహించారు. ఏఈ రాహుల్ మాట్లాడుతూ మండలంలో 219 మంది గృహనిర్మాణ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



అద్దంకిలో రంగు నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు

పర్చూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : హోలీ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంతో ఆనందంగా రంగులు, రంగునీళ్ళు చల్లుకుంటూ సందడి చేశారు.

బల్లికురవలో....

బల్లికురవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల వద్ద శుక్రవారం హోళి పండుగ వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస పనులకు వచ్చిన కార్మికులు ఈపండగను ఎంతో ఉల్లాసంగా జరుపుకొన్నారు. వేమవరం, మల్లాయపాలెం, బల్లికురవ, కొండాయపాలెం, చెన్నుపల్లి గ్రామాల పరిధిలో ఉన్న గ్రానైట్ కార్మికులు రోడ్లపైకి వచ్చి పండగను కోలాహలంగా నిర్వహించారు.

అద్దంకిలో...

అద్దంకి, మార్చి14(ఆంధ్రజ్యోతి): హోలీని శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని పలు కాలనీలలో చిన్నారులు, యువకులు, మహిళలు రంగు నీళ్లు చల్లుకున్నారు.

చినగంజాంలో...

చినగంజాం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో హోలి పండుగను ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా చిన గంజాం, కడవకుదురు, సోపిరాల, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా రంగుల పండుగను నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. చిన గంజాం గ్రామంలోని రాజస్థాన్ వాసులు గులాములు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నుల బహూకరణ



విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్ బహూకరించిన రోటరీ ప్రతినిధులు

పంగులూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు పరీక్ష రాసేందుకు అవసరమైన ప్యాడ్, పెన్, స్కేల్, పెన్సిల్స్ అందచేశారు. మొత్తం 57 మంది బాలబాలికలకు సుమారు 7,500 విలువ చేసే వస్తువులు అందచేసి తమ వితరణ చాటుకున్నారు. దాతలు నర్రా వెంకటేశ్వర్లు సతీమణి లక్ష్మీసుధ సౌజన్యంతో ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, ఉపాధ్యాయులు కాల్వ సోమశేఖర్, చిలుకూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, పీడీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నట్లు స్థానికులు కొండ్రు కిరణ్ తహసీల్దార్ గోపీకృష్ణకు ఫిర్యాదు చేశారు. వార్డులో ప్రభుత్వ స్థలాలు, రోడ్లు మార్జిన్‌లు ఆక్రమణలపై గతంలో పలుమార్లు వివాదాలు జరిగాయి. తాజాగా మరో ఆక్రమణలో విషయం మళ్లీ వెలుగులోకి వచ్చింది. దీంతో శుక్రవారం వార్డులో నివాసితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు.

అవీఇవీ

నేటి నుంచి పూనూరులో రాజగోపురం ప్రతిష్ఠా కార్యక్రమాలు

యద్దనపూడి/మార్టూరు, మార్చి14,(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శనివారం నుంచి శ్రీత్రిపురసుందరి సమేత శ్రీత్రిపురాంతకస్వామి, భద్రకాళీ సమేతవీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రాచకొండ హనుమంతురావు,రాధిక దంపతులు నిర్మించిన రాజగోపురం పంచ విమాన శిఖరం ప్రతిష్ఠాసహిత మహా కుంభాభిషేక మహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేస్తారు.

పది పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు



సీజింగ్ రూంకు తరలిస్తున్న పది పరీక్ష పత్రాలు

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సోమవారం నుంచి జరుగనున్న పది పరీక్షలకు సంబంధించి సంబంధిత అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. చీరాలలో 10, వేటపాలెంలో పరీక్షా కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. సెట్ 1 పరీక్ష పత్రాలు శుక్రవారం ఆయా కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు చేరాయి. పోలీసుల సమక్షంలో కస్టోడియన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్స్ సీజింగ్ రూంలో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. అలాగే సెట్ 2 పత్రాలు శనివారం రానున్నాయి. పరీక్ష ప్రారంభం రోజు నుంచి సంబంధిత పత్రాన్ని గంట ముందుగా అధికారులు పరీక్ష కేంద్రానికి చేర్చనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం అన్ని గ్రామాలలో స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు పీ 4 సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

నేడు, రేపు స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక

పంగులూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పంగులూరులో ఈ నెల 15, 16 తేదీలలో రాష్ట్రస్థాయి స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక జరుగుతుందని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి చెప్పారు. శని, ఆదివారాలలో జరిగే ఎంపిక కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100 మంది పురుషులు, 100 మంది స్త్రీ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపిక కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ బి.సి.హెచ్.గరటయ్యతోపాటు శాప్ పరిశీలకులు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ట్రెజరర్ కె.హనుమంతరావు పాల్గొంటారని తెలిపారు.

ఎంపికయిన జట్లకు 17 నుంచి 28 వరకు శిక్షణ

ఎంపికయిన స్త్రీ, పురుష ఖోఖో జట్లకు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమీలో శిక్షణ ఇస్తామని కళాశాల పీడీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం ఇరు జట్లు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగే 57వ సీనియర్ జాతీయస్థాయి స్త్రీ, పురుష ఖోఖో పోటీలలో పాల్గొంటాయని చెప్పారు.

శింగరకొండ తిరునాళ్లలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు

అద్దంకి, మార్చి14(ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70 వార్షిక తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వంశీకృష్ణతో పాటు పలు విభాగాల వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రధానంగా షుగర్, బీపీ, ఇతర సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు నిర్వహించారు. అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ కూడా అందుబాటు లో ఉంచారు.

యువపారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం




సమావేశంలో మాట్లాడుతున్న అధికారి రామకృష్ణ

చీరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ ద్వారా యువపారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించి ఉపాధి అవకాశాలను మెరుగు పరచనున్నట్లు కేవీఐసీ డైరెక్టర్ ఎస్ గ్రీస్, డీఐసీ రామకృష్ణ చెప్పారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీలు కోటిరెడ్డి, వాణి, బీసీ కార్పొరేషన్ ఏఈవో చిట్టిబాబు, డీపీఎం లక్ష్మణాచారి, ఏపీఎంలు మధు, అంజిబాబు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఎంల్‌హెచ్‌పీ బదిలీ

యద్దనపూడి,(మార్టూరు)మార్చి14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో జాగర్లమూడి విలేజ్ హెల్త్ క్లినిక్ నందు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సరోజినిని కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రీజనల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ గుంటూరు నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉత్తర్వులు వచ్చినట్లు శుక్రవారం వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు.





పున్నమి వెన్నెల్లో గరుడుడిపై చల్లనయ్య!

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : పున్నమి వెన్నెల్లో రంగనాథ స్వామి తన కిష్టమైన గరుడ్మంతుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం మోహినీ అవతారం, గిన్నెబిక్ష వేడుకలు జరిగాయి. సాయంత్రం మూలవర్లకు, ఆలయానికి విశేష పూలంగిసేవ జరిగింది. గరుడోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ చరిత మానస ప్రచార మండలి నూతన శ్వేత ఛత్రాన్ని సమర్పించింది. అనంతరం బంగారు గరుడసేవ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.24

సహరి (ఆదివారం) : 5.01

కల్యాణ వైభోగమే!

- వేడుకగా ప్రసన్నుడి వివాహం
- భక్తులతో నిండిన బిలకూటక్షేత్రం

బిట్రగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మంగళవాయిద్యాలు.. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం కనులపండువగా జరిగింది. బిలకూటక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం మేళతాళాల నడుమ ఉత్సవర్లను ఊరేగింపుగా కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. వాటిని కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి, ఈవో రాధాకృష్ణ వేదపండితులకు అందచేశారు. పెద్ద, చిన్న ఉత్సవర్ల కల్యాణ ఉభయకర్తలు బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర, కొల్లపనేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందచేశారు. శ్రీనివాసుడి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం తరలి వచ్చింది. గోవింద నామస్మరణతో క్షేత్రం మారుమోగి పోయింది. కాగా, రాత్రి స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.



శ్రీనివాస కల్యాణం జరుపుతున్న వేదపండితులు, పాల్గొన్న మంత్రి ఆనం, ఎమ్మెల్సీ బీద



ప్రసన్నుడి రథం ముందు గుమికూడిన భక్తజనం

ఆగిపోయిన రథానికి మరమ్మతు చేస్తున్న సాంకేతిక నిపుణులు

కదలని రథం!

- చేసిన ప్రయత్నాలన్నీ వృథా

కావలి, (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నుడి రథానికి అడుగడుగునా ఆటంకం కలుగుతోంది. శుక్రవారం శ్రీవారి కల్యాణం అనంతరం వధూవరులను రథంలో కొలువు దీర్చి ఊరేగించాల్సి ఉంది. ఈ మేరకు ఉత్సవర్లను కొలువదీర్చాక రథం ముందుకు కదిలింది. సుమారు 25 అడుగుల దూరం వచ్చాక కదల్లేదు. చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో చివరకు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ప్రజలే బోయిలై ఊరేగించారు. కాగా, 2020లో బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ముందు రథం కాలిపోయింది. దీంతో అప్పట్లో రథోత్సవాన్ని రద్దు చేశారు. 2021, 2022లలో పూలరథం తయారు చేసి స్వామివారిని ఊరేగించారు. 2023లో కొత్త రథాన్ని తయారు చేశారు. అయితే, అప్పట్లో రథం ఒరిగిపోయి దెబ్బతిన్నది. 2024లో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి ఉత్సవర్లను ఊరేగించారు. అయితే, ఈ ఏడాది మాత్రం అసలు రథం ముందుకు కదల్లేదు. మరమ్మతుల చేపట్టినా మధ్యలో నిలిచిపోతుందే మోనన్న అనుమానం అందరిలో మెలిగింది. దీంతో పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. ఉత్సవాలలో తెలయకుండా మానవ తప్పిదాలు జరుగుతుండటంతో తరచూ రథోత్సవానికి ఆటంకాలు కలుగుతున్నాయని, ఆగమ శాస్త్రం ప్రకారం సరిచేసుకుని భవిష్యత్తులో తప్పులు జరగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

- లస్కర్ల నియామకంలో అంతులేని జాప్యం
- మూడేళ్ల నుంచి వారు లేకుండానే సాగు
- వీరు లేక రెండేళ్ల క్రితం 20 టీఎంసీలు వృథా
- రానున్న సీజన్‌లోనూ పొంచి ఉన్న ప్రమాదం
- ఈ దఫానైనా ఉన్నతాధికారులు కరుణిస్తారా!?

నెల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారింది.. ప్రజాప్రతినిధులు మారారు.. ఆఖరికి అధికారులు కూడా కొత్తవారు వచ్చారు.. కానీ రైతుల సమస్య మాత్రం కొలిక్కిరాలేదు. గడిచిన మూడేళ్ల నుంచి లస్కర్లు లేక కాలువలపై నీటి యాజమాన్యం చాలా ఇబ్బందిగా మారుతోంది. బ్రిటీషు కాలం నుంచి లస్కర్ల వ్యవస్థ జిల్లాలో సాఫీగా నడుస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చి నాశనం చేసింది. 2022 తర్వాత లస్కర్ల నియామానికి అనుమతులు ఇవ్వలేదు. అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా, వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. దీని పుణ్యమా అని రూ.వేల కోట్ల విలువైన నీరు లస్కర్ల లేని కారణంగా దుర్వినియోగ మైంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా తొలి జడ్పీ సమావేశంలోనే ఈ లస్కర్ల సమస్యపై ఎమ్మెల్యేలు గళం విప్పారు. ఇది జరిగి ఏడు నెలలు గడిచినా సమస్య కొలిక్కి రాలేదు. జిల్లాస్థాయి ఇరిగేషన్ అధికారులు సకాలంలో, సరైన విధంగా ప్రతిపాదనలు పంపడంలో విఫలమవుతుంటే.. రాష్ట్రస్థాయిలో ఉన్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ ప్రతిపాదనలను ఆమోదించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రానున్న సీజన్ కీలకం

గతేడాది ప్రకృతి సహకరించడం, ప్రభుత్వ ముందుచూపుతో ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ప్రస్తుత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాలు, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతోంది. ఈ పంట ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఈ నెలాఖరుతో దాదాపుగా వరి కోతలు పూర్తవుతాయని అంచనా. ఏప్రిల్ నుంచి రెండో పంట మొదలవుతుంది. అయితే ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను బట్టి చూస్తే రానున్న సీజన్ చాలా కీలకంగా మారనుంది. మొదటి పంట మాదిరిగా రెండో పంట సమయంలో పూర్తి ఆయకట్టుకు నీరు అందించడం సాధ్యపడదు. సోమశిల, కండలేరుల కింద 4-5 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించగలరు. అప్పుడు నీటి యాజమాన్యం చాలా కీలకంగా మారుతుంది. ఒక కాలువ కింద కొంత ఆయకట్టు వరకే నీటి కేటాయింపులు జరిపినా క్షేత్రస్థాయిలోకి వచ్చే సరికి రైతులు అవేవీ పట్టించు కోకుండా సాగు చేసేస్తుంటారు. వీరిని నిలువరించ కుండా నీటిని వదిలేస్తే చివరకు రైతులంతా నష్టపోతారు. ఇక్కడ లస్కర్ల పాత్ర చాలా ముఖ్యం. కాలువల కింద నిర్దేశిత ఆయకట్టుకు మించి సాగు చేయకుండా అవగాహన కల్పించడంలోనూ, నీరు వృథా కాకుండా ఆయకట్టు రైతులకు మాత్రమే అందించడంలో లస్కర్లు కీలకంగా ఉంటారు. నీటి యాజమాన్యం సక్రమంగా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం ఇదే రెండో పంట సీజన్లో లస్కర్లు లేని కారణంగా నీటి యాజమాన్యం సక్రమంగా జరగక 20 టీఎంసీల వరకూ నీరు వృథా అవ్వడం గమనార్హం.

సీజన్‌కు రూ.1.2 కోట్లు ఇవ్వలేరా?

చెరువులు, కాలువల నుంచి నీటిని అవసరం మేరకు చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయడంలో క్షేత్రస్థాయిలో లస్కర్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. వీరు కాలువలపై తూములు, చెక్కలను అవసరం మేరకు ఎత్తుతూ, దించుతూ ఉంటారు. ఇంతటి కీలకమైన లస్కర్లను గత ప్రభుత్వం పెండింగ్ వేతనాలు కూడా చెల్లించకుండానే తొలగించింది. అప్పటివరకూ జిల్లాలో 230 లస్కర్లు పనిచేస్తున్నారు. వీరికి ఒక సీజన్‌కు ఐదు నెలలు మాత్రమే నెలకు రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తుంటారు. ఈ లెక్కన ఒక సీజన్‌కు రూ.1.20 కోట్లు మాత్రమే లస్కర్లకు ఖర్చవుతుంది. అయితే వీరు సక్రమమైన నీటి యాజమాన్యం ద్వారా అంతకన్నా అనేక రెట్లు విలువైన నీటిని పొదుపు చేయడంతోపాటు రైతుల ఇబ్బందులను తొలగిస్తుంటారు. అయినా లస్కర్ల నియామకంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రతి సీజన్‌లోనూ కాలువల్లో ఓఅండ్ఎం పనుల కోసం జిల్లాలో సుమారు రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేస్తుంటారు. అయితే లస్కర్లకు మాత్రం రూ.1.20 కోట్లు ఇవ్వలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి వసూలు చేసిన శిస్తు నగదుతో లస్కర్లను నియమించుకోవాల్సి ఉంది. కానీ చాలా కాలం నుంచి శిస్తు వసూళ్ల జరగడం లేదు. అయితే రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరో హెడ్ కింద లస్కర్ల నియామకానికి అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నా ఆలోచన చేయడం లేదు. మరి రానున్న సీజన్‌కైనా లస్కర్ల నియామకానికి రాష్ట్ర ఉన్నతాధికారులు కరుణిస్తారో.. లేదో.. చూడాలి.

అడుగుతూనే ఉన్నాం

జిల్లాలో లస్కర్ల నియామకానికి గత సీజన్‌కు ముందే ప్రతిపాదనలు పంపాం. అయితే వారిని నియమించుకునే హెడ్ కింద ఫండ్ లేకపోవడంతో అనుమతులు రాలేదు. తర్వాత మరో హెడ్ కిందనైనా అనుమతులు ఇవ్వాలని అడుగుతున్నాం. రానున్న సీజన్‌కు సంబంధించి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ



వామ్మో.. స్కూళ్లలో సెగలు

- నేటి నుంచి ఒంటిపూట బడులు
- చెట్ల కింద తరగతులు నిర్వహిస్తే చర్యలు
- ఏప్రిల్‌లో 2వ శనివారం పనిదినం

నెల్లూరు (విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత ఈ ఏడాది ముందుగానే మొదలైంది. గత పది రోజులుగా భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం మినహా ఎవరూ బయటకు రావడం లేదు. మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కానీ బడి పిల్లలు మాత్రం బయటకు వెళ్లక తప్పడంలేదు. కాలినడకన, సైకిళ్లమీద బడికి వెళ్లే గ్రామీణ విద్యార్థులు ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒంటిపూట బడులను ప్రకటించింది. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న తరుణంలో శనివారం నుంచే 1 తరగతి నుండి 9వతరగతి వరకు అన్ని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలన్నీ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలను జారీ అయ్యాయి. టెన్త్ పరీక్షలు జరిగే పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

- పాఠశాలలకు సూచనలు

అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు విద్యాశాఖ పలు సూచనలు జారీ చేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీ రావు తెలిపారు. విద్యాశాఖ అకడ మిక్ క్యాలెండర్‌ను అనుసరించి పాఠశాల సమయాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏప్రిల్ నెలలో రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని, అన్ని పాఠశాలల్లో మంచినీటిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు శుద్ధి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాలు, చెట్లకింద తరగతులు నిర్వహించకూడదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, భోజనం అందించాకే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా వేసవి తాపానికి ఎవరైనా గురైతే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య పరీక్షలు చేపట్టడంతోపాటు పాఠశాల పరిసరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సంబంధిత హెచ్ఎంలు వీటన్నిటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

బీమా.. పాడిరైతుకు ధీమా!

- జిల్లాకు రూ.15 లక్షలు విడుదల
- ఒకసారి చేయిస్తే మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న పశుపోషకులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. పశు బీమా నమోదుకు చర్యలు చేపట్టడంతో పాటు తన వాటా కింద జిల్లాకు రూ.15లక్షలు విడులయ్యాయి. ఒకసారి పశుబీమా చేయించుకుంటే మూడేళ్ల వరకు వర్తిస్తుందని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 57,774 తెల్ల పశువులు, 6,46,088 నల్ల పశువులు, 10,95,197 గొర్రెలు, 1,86,929 మేకలు, 2,969 పందులు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో పశునష్ట పరిహారం పథకం తీసుకొచ్చినా పాడిరైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. పశువులు అనారోగ్యానికి గురై జబ్బు చేసి చనిపోతే పాడిరైతులు ఎంతో నష్టపోతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం బీమాపై దృష్టి సారించింది. ప్రభుత్వం కొంత ప్రీమియం చెల్లించడంతోపాటు పాడిరైతు కొంత మేర చెల్లింపులు చేయడం ద్వారా ఆ నష్టం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉండేలా కార్యాచరణ రూపొందించింది. గతేడాది దాదాపు రూ.15.8లక్షలు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన పశువులకు కూడా ఇటీవల పరిహారం అందించారు. తాజాగా మరోసారి రూ.15లక్షలు మంజూరయ్యాయి.

- ఆవు, గేదె జాతి పశువులకు..

మేలు జాతి పశువుకు రూ.30వేలు, నాటు పశువుకు రూ.15వేలు, ఒకటిన్నర సంవత్సరంపైబడిన మేలుజాతి ఎద్దులు, దున్నలకు రూ.30వేలు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు రూ.15వేలు బీమా వర్తిస్తుంది. ఇందులో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80శాతం రాయితీ లభిస్తుంది. అంటే రూ.30వేల బీమాకు ప్రభుత్వ రాయితీ రూ.1536 కాగా లబ్ధిదారుడి ప్రీమియం రూ.384. అదేవిధంగా రూ.15వేల బీమాకు ప్రభుత్వ రాయితీ రూ.768, లబ్ధిదారులు రూ.192 చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న పాడిరైతులకు 50శాతం రాయితీ అందుతుంది.



- గొర్రెలు, మేకలు, పందులకు..


6నెలలు ఆపైన వయసు కలిగిన గొర్రెలు, మేకలు, పందులకు ఒకదానికి రూ.6వేలు బీమా వర్తిస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం రాయితీ లభిస్తుంది. ప్రభుత్వ రాయితీ రూ.300, లబ్ధిదారుని ప్రీమియం రూ.75. దారిద్ర్యరేఖకు ఎగువ ఉన్నవారికి 50శాతం రాయితీ అందుతుంది.

మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో పశుబీమా నమోదు జరుగుతోంది. ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుంది. 80 శాతం రాయితీ పొందాలనుకునే లబ్ధిదారులు బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డులతో పాటు రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రైతు సేవా కేంద్రా లను సంప్రదించాలి

- రమేష్‌నాయక్, పశుసంవర్థక శాఖ జేడీ

టమో'రా'!



- గిట్టుబాటు లేక చెట్లకే వదిలేశారు!

కందుకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : టమోటా సాగు చేపట్టిన అన్నదాత ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్నాడు. కనీసం గిట్టుబాటు ధర కూడా దక్కకపోవడంతో కాయలన్నీ చెట్లకే వదిలేస్తున్నారు. మార్కెట్లో కిలో టమోటా రూ.15 నుంచి 16 వరకు పలుకుతోంది. సాగుదారుల వద్ద కిలో ఆరు రూపాయలకు కూడా కొనే పరిస్థితి లేదు. అయితే, పండించిన టమోటాలను కోసి మార్కెట్‌కు తరలించాలన్నా కిలోకు రూ.10వరకు వ్యయం అవుతుండటంతో కోత ఖర్చులు కూడా రావని వదిలేసుకుంటున్నారు. కందుకూరు ప్రాంతంలో ఓగూరు, బొంతవారిపాలెం తదితర ప్రాంతాలలో ఈ ఏడాది విస్తారంగా టమోటా సాగుచేశారు. డిసెంబరు, జనవరి మాసాలలో వేసిన టమోటా నాట్లు ప్రస్తుతం నిండుగా కాపు, పండిన కాయలతో దర్శనమిస్తున్నాయి. ఎకరానికి 30-40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన టమోటాలు కొనేనాథుడు లేక రైతులు దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. కూరగాయల సాగు లాభాలు పండిస్తాయని, టమోటా సాగుతో లక్షాధికారులు కావచ్చన్న ఆకాంక్షతో సాగుచేసిన రైతులు నేడు నష్టపోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు సన్నాహాలు

- నాలుగు విడతల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల హడావుడి పూర్తవుతున్న తరుణంలో స్పాట్ వాల్యుయేషన్ కూడా వేగవంతంగా పూర్తి చేయాలంటూ ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో నాలుగు విడతల్లో స్పాట్‌ను పూర్తి చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఈ నెల 7వ తేదీన తొలుతగా సంస్కృతం మూల్యాం కనాన్ని ప్రారంభించారు. తాజాగా పరీక్షలన్నీ పూర్తవుతుండటంతో 17వ తేదీ నుంచి మొదటి స్పెల్‌లో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టులలో మూల్యాం కనం నిర్వహిస్తున్నారు. అలాగే 22 నుంచి రెండవ స్పెల్‌లో ఫిజిక్స్, ఎకనామిక్స్‌లలో, 24 నుంచి మూడో స్పెల్‌లో కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టులు, 26 నుంచి నాలుగో స్పెల్‌లో బాటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులలో స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభించనున్నారు. ఇంటర్‌బోర్డు మూల్యాంకనానికి నియమించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులంతా సంబంధిత తేదీల్లో స్పాట్ సెంటర్‌లో తప్పనిసరిగా రిపోర్టు చేయాలని ఆర్ఐవో శ్రీనివాసులు పేర్కొన్నారు. హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

రాళ్లపాడుకు రెగ్యులర్ ఈఈని నియమించండి

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్ర జ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టునకు రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును నియమించాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గతేడాది డిసెంబరు 31న అప్పటి ఈఈ సుగుణాపాల్ పదవీ విరమణ పొందారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు మార్కాపురం ఈఈ పురార్ధనరెడ్డిని ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో ఏఈలు, లస్కర్లు, ఎలక్ట్రీషియన్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌ల కొరత వేధిస్తోంది. ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరుణాళ్ల

కావలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ తిరునాళ సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3రోజుల పాటు నిర్వహించనున్న తిరుణాళలో ఉదయం అభిషేకాల అనంతరం రాత్రి 7గంటలకు పల్లకీసేవ, గుడి ఉత్సవం నిర్వహిసారు. శనివారం ఉదయం దుర్గహోమం, రాత్రి 8గంటలకు తిరుపతమ్మ బుర్ర కథ, ఆదివారం అమ్మవారికి ఉదయం పొంగళ్లు, మొక్కుబడులు, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ, రాత్రి 8 గంటలకు మృగరాజు వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం చేపడతారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం సంవృద్ధిలో భాగంగా టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ మహిళలు స్థానిక సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు అందజేయాలన్నారు. రోజుకి 8గంటల శిక్షణ కాలానికి 45రోజులు, 6గంటల కాలానికి 60 రోజులు, 4గంటల శిక్షణకు 90 రోజులుగా ఎంపిక చేసుకొని శిక్షణ పొందవ చ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చాకిచర్ల, అలగాయపాలెం, కరేడు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందితో సహకరించగలరని కోరారు.

16 నుంచి 23 వరకు అమ్మవార్లకు పొంగళ్లు

కందుకూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రామదేవతలకు ఈనెల 16 నుంచి 23వరకు సద్దులు, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామదేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ వరకు పోలేరమ్మతల్లికి సద్దులు, మహాలక్ష్మీ అమ్మవారికి వడపప్పును భక్తులు సమర్పించాలని 23న అంకమ్మ అమ్మవారికి పాలపొంగళ్లు పెట్టుకోవాలని కోరారు.

గ్రేడింగ్‌తోనే మద్దతు ధర



వెలగపాడు కొత్తూరు వద్ద గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న టీమ్ సభ్యులు

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొగాకునకు మద్దతు ధర అందాలంటే గ్రేడింగ్ విధానంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పొగాకుబోర్డు ఫీల్డ్ ఫ్రెండ్స్ టీమ్-6 సభ్యులు ఐటీసీ సైంటిస్టు వెంకటేశ్వరరావు, శివారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మరియు క్షేత్ర సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం వేలం కేంద్రం పరిధిలోని కొత్తూరు, వెలగపాడు, పెద్దపాడు, కమ్మవారిపాలెం, కావలియడవల్లి గ్రామాలను సందర్శించారు. గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించి పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలను తెలిపారు. గ్రేడింగ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుందని, బోర్డు అధికారులు తెలియజేసే సూచనలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మాల్యాద్రి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో చూసే సెన్సార్ ఏర్పాటు

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):రాళ్లపాడు ప్రాజెక్టు నీటి వనరులను వెబ్‌సైట్‌లో చూసేందుకు గేజింగ్ డివిజన్ అధికారులు ప్రాజెక్టు వద్ద సెన్సార్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో, నీటిలోతు ఎంత ఉంది.. ఇతర వివరాల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నీటి వనరులను ఈ వెబ్‌సైట్‌లో ఒంగోలు, గుంటూరు, విజయవాడ ఇరిగేషన్ ఉన్నతాధికారులు చూసి ప్రభుత్వానికి తెలియజేస్తుంటారని చెప్పారు.

కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

- నాలుగు బ్యాంకుల పరిధిలో 44 యూనిట్ల మంజూరు
- 216 మంది దరఖాస్తుదారులు ● పూర్తయిన ఇంటర్వ్యూలు



లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

కొండాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పలు సామాజిక కార్పొరేషన్లతో రాయితీ రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన అన్నిర కాల ధ్రువీకరణ పత్రాలతో మండలపరిధిలోని అన్ని సామాజికవర్గాలకు చెందిన లబ్ధిదారులు 216మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలను గతనెలలో అధికారులు, సంబంధిత బ్యాంకర్లు పూర్తి చేశారు. ఎవ్వరిని ఎంపిక చేస్తారో అని అభ్య ర్థులు ఎదురుచూస్తున్నారు. ఇదీ మండలంలో రాయితీ రుణాలకు నమోదు చేసుకున్న దరఖాస్తుదారుల పరిస్థితి.

● మంజూరైన యూనిట్లు 44

మండలంలో కొమ్మి, కొండాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు, సాయి పేట, తూర్పు ఎర్రబల్లిలో యూనియన్ బ్యాంకులున్నాయి.

● కొమ్మి బ్యాంకు పరిధిలో బీసీ-7, కాపు-1, రెడ్డి-1, కమ్మ-1 మొత్తం 10 లోన్లు, కొండాపురం బ్యాంకు పరిధిలో బీసీ-8, కాపు-1, ఈబీసీ-1, రెడ్డి-1, బ్రాహ్మణ-1, జనరిక్ ఈబీసీ-1 మొత్తం 13, సాయిపేట బ్యాంకు పరిధిలో బీసీ-8, కాపు-1, రెడ్డి-1, కమ్మ-1 మొత్తం 11లోన్లు, తూర్పుఎర్రబల్లి బ్యాంకు పరిధిలో బీసీ-7, కాపు-1, రెడ్డి-1, ఆర్యవైశ్య-1 మొత్తం 10లోన్లు మంజూ రయ్యాయి. మొత్తంగా బీసీ-30, కాపు-4, ఈబీసీ-2, రెడ్డి-3, కమ్మ-2, ఆర్యవైశ్య-1, బ్రాహ్మణ-1, జనరిక్ ఈబీసీ- 1 కలిపి 44 లోన్లు మంజూరయ్యాయి. ఈ లోన్ల కోసం 221 మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంట ర్వ్యూలు నిర్వహించిన అధికారులు తుది జాబితాను విడుదల చేయలేదు.

● లబ్ధిదారుల ఎంపికలో నాయకుల సతమతం

తక్కువగా లోన్లు మంజూరవ్వడం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో ఎవరిని ఎంపికచేయాలో అర్థంకాక అధికార పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనికితోడు టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు అధికారికంగా కూటమికావడంతో ఎవరికి వారు మేమే అని చెప్పుకుంటున్నారు. సమన్వయం చేసేం దుకు మండలంలో నాయకులు అంతగా చొరవ తీసుకోవడం లేదు. ప్రతియూనిట్‌కు 50 శాతం రాయితీపోగా మిగిలిన నగదు బ్యాం కులు లోనుగా ఇచ్చి అభ్యర్థులు ఎంచుకొన్న రంగంలో పెట్టుబడి పెట్టి వాయిదాలవారీగా బ్యాంకులకు సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది. 50శాతం రాయితీ వస్తుండటంతో ఎక్కువ మంది లోను తమకే కావాలని కోరుకుంటున్నారు. మార్చి నెలాఖరులోగా ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఈలోగా ఎవరిని ఎంపిక చేస్తారో అని దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు.

ప్రక్రియను సకాలంలో పూర్తిచేస్తాం



రాయితీ రుణాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సకాలంలో పూర్తిచేస్తాం. ప్రతి యూనిట్‌కు ఇద్దరి ని ఎంపిక చేసి సంబంధిత బ్యాంకులకు జాబి తాను అందజేస్తాం.

- ఆదినారాయణరావు, ఎంపీడీవో, కొండాపురం

భూ వివాదంపై విచారణ

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెదకొండూరులోని కాలనీవాసులు, పట్టాదారులకు జరిగిన భూ వివాదంపై శుక్రవారం తహసీల్దారు రవీంద్రబాబు తన కార్యాలయంలో రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఇరువర్గాలను పిలిపించి వారి వద్దనున్న పత్రాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చే సమయంలో ఇరువర్గాలవారి మధ్య వాగ్వాదాలు పెరిగి దాడి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానికుల సర్దుబాటు అనంతరం ఇరువర్గాలు పోలీసుస్టేషనుకు వెళ్లారు. రెవెన్యూ అధికారుల నుంచి సదరు స్థలానికి హక్కుదారులు ఎవరూ అని తేలేవరకు స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని ఎస్ఐ ఉమా శంకర్ హెచ్చరించారు.



పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దారు

ఉల్లాసంగా హోళీ సంబరాలు

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు శుక్రవారం హోళి సంబరాలు జరుపు కున్నారు. చిన్నారులు, యువకులు మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా పండుగ వేడుకలు చేసుకున్నారు. పట్టణంలోని బీవీఆర్ అపార్ట్‌మెంట్ వద్ద పెద్దల సమక్షంలో చిన్నారులు వాటర్‌గన్‌లో రంగులు నింపుకొని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.



సంబరాల్లో పాల్గొన్న కుటుంబసభ్యులు

● కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి): హోళీ పండుగ పర్వదినంను పురస్కరించుకుని పట్టణ ప్రజలు హోళి సంబరాలు నిర్వహించారు. మొదట ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయా కూడళ్లలో నివాసం ఉన్న పిల్లలు పెద్దలు కలిసి రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ముసునూరు రాఘవేంద్ర కాలనీలోని ఓ నివాసంలో ఇతర ప్రాంతాల్లో నివసించే వారు సైతం కావలికి చేరుకుని కుటుంబసభ్యులంతా రంగులు చల్లి మిఠాయిలు పం చిపెట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపు కున్నారు.

● కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలల్లో శుక్రవారం హోళీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పం డుగలో చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సరదగా, ఆనందంగా వేడుకలు నిర్వహించుకున్నారు. వైకుంఠపురంలో చిన్నారులు వాటర్ గన్‌లల్లో రంగునీళ్ల కలుపుకుని, డబ్బాలతో రంగునీళ్ల పోసుకున్నారు.



రంగులు చల్లుకుంటున్న పిల్లలు

మామిడి పంట సాగు పరిశీలన

● నూజివీడు ఉద్యాన శాస్త్రవేత్త కనన మహాలక్ష్మి



రైతులకు సూచనలిస్తున్న నూజివీడు ఉద్యాన సైంటిస్ట్ కనక మహాలక్ష్మి

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.రాజుపాలెం పరిసర ప్రాంతంలో సాగుబడిలో ఉన్న మామిడి తోటలను శుక్రవారం నూజివీడు ఉద్యానవన పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్టు కనక మహాలక్ష్మి పరిశీలించారు. నల్లతామర, తేనెమంజు పురుగు ఉధ్రుతంగా ఉన్నట్లు గమనించారు. నివారణ చర్యలలకు బప్రోఫిజెన్, ఎసిటేట్ కెమికల్స్ 1.5 గ్రాములు వంతున లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా పసు పు, బులుగు జిగురు అట్టలు వాడాలని అవి అందుబాటులో లేకుంటే కాటన్ చీరలు జిగు రువంటి పదార్థాల్లో ముంచి చెట్ల మధ్య కట్టాలని రైతు లకు సూచించారు. ఆంత్రక్నోస్ పక్షి తె గులు కూడా అధికంగా ఉన్నట్లు గుర్తించి ని వారణకు సాఫ్ మందును పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె రాలకుండా ఉండాలంటే ఒన్‌టైం నీటి తడులు సమక్రమంగా చెట్లకు పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి బీ.జ్యోతి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు లేనట్టేనా!?

వలేటివారిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే ఉపాధి పనులు చేసేందుకు కూలీలు నానా అవస్థలు ఎదుర్కొంటారు. అందువల్ల ఈ నాలుగు నెలల్లో (మార్చి, ఏప్రిల్, మే, జూన్) ఉపాధి కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారణంగా వేతనం చెల్లించేవారు. అయితే ఈసారి కూలీలకు వేసవిభృతిపై కేంద్రప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఆదేశాలు జారీ కాలేదు. కూలీలకు చెల్లించే రోజువారీ వేతనం రూ.300లకు పెంచడంతో వేసవిభృతి అందుల్లోనే ఉంటుందని చెబుతున్నారు.

● మండలంలో ఇదీ పరిస్థితి..

21 గ్రామ పంచాయతీల్లో 10,683 జాబ్‌కార్డులున్నాయి. అందులో 17,775 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 3వేలకు పైగానే కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవిలో ప్రభుత్వాలు మార్చి నెలలో 25శాతం, ఏప్రిల్‌లో 30శాతం, మే నెలలో 30శాతం, జూన్‌లో 20 శాతం వరకూ పనులు పరిమాణం తగ్గించి నూరుశాతం పనికి వేతనం అందించేవారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కూలీలకు మంచినీటి సౌకర్యం పని ప్రదేశాల్లో టెంట్‌లు ఏర్పాటు, మెడికల్ కిట్లు ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందించే వారు. అయితే ప్రస్తుతం పని ప్రదేశాలలో అలాంటి సౌకర్యాలు ఏమి లేవు. దీంతో కూలీలు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని కూలీలకు వసతులు ఏ ర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.



అయ్యవారిపల్లెలో మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

ఆస్తి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- పన్నులు బకాయిలు చెల్లించకపోతే దుకాణాలు సీజ్ చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



ఇంటి యజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, ఆర్వో తదితరులు

కావలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘంలో ఆస్తిప న్నుల వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, రెవెన్యూ అధికారి ఫణికుమార్‌లు తమ సిబ్బందితో శుక్రవారం అధిక మొత్తంలో పన్నులు కట్టాల్సిన యజమానుల వద్దకు వెళ్లి ఒత్తిడి తెచ్చారు. నూరుశాతం ఆస్తి పన్నులు వసూళ్ల చేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులు కమిషనర్లపై ఒత్తిడి తేవడంతో కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావ ణ్‌కుమార్, సచివాలయాల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేసి వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలా చేస్తున్నా ఆశించిన లక్ష్యాలు నెరవేరటం లేదు.

● రావాల్సిన బకాయిలు రూ.3కోట్లు

కావలి పురపాలక సంఘంలో ప్రభుత్వ ఆస్తులు మినహాయిస్తే ప్రయివేట్ ఆస్తుల పన్నుల డిమాండ్ రూ.10కోట్లు ఉంది. ఇప్పటివరకు రూ.7కోట్లు వసూలు అయ్యింది. మిగిలిన రూ.3 కోట్లు వసూలును కేవలం 15రోజులు మాత్రం వసూలు చేయాల్సి ఉంది. దీంతో నేరుగా ఆయనే రంగంలోకి దిగి తమ సిబ్బందితో ఆస్తిపన్నుల వసూళ్ల కోసం బకాయిదారుల ఇంటింటికి తిరుగుతున్నారు.

● కావలి రైల్వే రోడ్డులో మున్సిపల్ అధికారులు, ఇంటి యజమానురాలి మధ్య ఆసక్తికర సంభాషణలు చోటు చేసుకున్నాయి

మున్సిపల్ కమిషనర్: ఇంటి పన్ను బకాయి ఉంది. చెల్లించకపోతే మీ దుకాణాలు సీజ్ చేయాల్సి వస్తోంది.

ఇంటి యజమానురాలు: ఇంటి పన్నులు మీ ఇష్టప్రకారం పెంచుకుంటూ పోతే ఎలా కట్టాలి సార్. గతేడాది కన్నా రెట్టింపు పన్నులు పెంచారు. మౌలిక వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి.

కమిషనర్: ప్రభుత్వ ఆస్తుల ప్రకారం పన్నులు పెంచాం.

ఇంటి యజమానురాలు: మీరైతే మీ ఇష్ట ప్రకారం పన్నులు పెంచారు. మాకైతే మూడేళ్లగా ఇంటి అద్దెలు పెరగటం లేదు. పన్నులు ఎక్కడ నుంచి తెచ్చికట్టాలి.

కమిషనర్: ఆస్తుల విలువలు పెరిగాయి కదా.

ఇంటి యజమానురాలు : ఆస్తుల విలువలు పెరిగితే ప్రయోజనం ఏమిటి. అసలు ఇళ్లను అద్దెకు తీసుకునే వారు కూడా లేరు. మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి.

కమిషనర్: మీరు పన్నులు చెల్లించకపోతే మీ దుకాణం సీజ్ చేయక తప్పదని తమ సిబ్బందితో షట్టర్ వేయమని చెప్పటంతో ఆమె మెత్తబడింది. చివరకు ఇంటికి వెళ్లి కొంత పన్ను చెల్లించటంతో అధికారులు వెనుదిరిగారు. పన్నుల కోసం ఒత్తిడి తెస్తూ ఇళ్ల యజమానుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

గురుడుడిపై శ్రీవారి వైభోగం



కావలి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆల య కమిటీ అధ్యక్షులు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధా న అర్చకులు బుర్రా శే షాచార్యులు అర్చక బృందం ఉత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉద యం హోమం, స్నపన ప్రత్యేక పూజలు, హోమం పూజల అనం తరం మోహిని ఉత్సవం కనులపండువగా సాగిం ది. గరుడ సేవలకు ఉభయదా తలుగా తిరివీధి బ్రహ్మయ్య దంపతులు తిరివీధి ప్రసాద్ దంపతులు వ్యవహరిం చారు. రాత్రి హోమం పూజల అనంతరం శ్రీవారు గరుడ వాహ నంపై విహరిస్తూ భక్తులకు ద ర్శన మిచ్చారు. కార్యక్రమంలో అ న్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు కమిటీ సభ్యులు భక్తజనం పాల్గొన్నారు.

చిన్నరైతుకు.. పెద్ద సాయం

- నూరుశాతం రాయితీతో సూక్ష్మ సేద్య పరికరాలు
- రానున్న ఖరీఫ్ నుంచి అమలు చేయనున్న ప్రభుత్వం

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు పంటల సాగులో సూక్ష్మ సేద్యం పరికరాలు (డ్రిప్)ను రానున్న ఖరీఫ్ పంటకాలం నుంచి ప్రభుత్వం నూరుశాతం ఉచితంగా అందించేందుకు కార్యచరణ రూపొందించింది. ఉద్యాన పంటల సాగులో బిందు, తుంపర సేద్యం అమలును ప్రోత్సహించడంతో పాటు సాగునీటి వృథాను అరికట్టేందుకు ఈ పథకం ఉపయోగపడనుంది.

● కేంద్రం 33శాతం.. రాష్ట్రం 67శాతం నిధులు మంజూరు

రాష్ట్రీయ కృషి వికాస యోజనలో భాగంగా రైతులకు ఇచ్చే ఉచిత పరికరాలకు అయ్యే ఖర్చులో కేంద్రం 33శాతం నిధులు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 67శాతం నిధులను భరిస్తుంది. ఈ విధానంలో లబ్ధిదారుడి పొలంలో ఖచ్చితంగా బోరు సౌకర్యం కలిగి ఉండాలి. బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత రైతుకు ఉన్న భూమిని బట్టి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుండి డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు అందిస్తారు.

● 5ఎకరాలలోపు సాగుభూమి ఉన్న ఒక్కో రైతుకు సూక్ష్మ సేద్య పరికరాలకు గరిష్టంగా రూ.2.18లక్షల వరకు, 5నుండి 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు 50నుంచి 70 శాతం వరకు రాయితీపై గరిష్టంగా రూ.3.10లక్షల విలువైన పరికరాలు, 10నుంచి 12.5 ఎకరాల వరకు రైతులకు 50శాతం రాయితీపై గరిష్టంగా రూ.4లక్షల వరకు పరికరాలను అందిస్తారు.

● గత వైసీపీ ప్రభుత్వం సూక్ష్మసేద్యంపై శీతకన్ను ప్రదర్శించడంతో ఈ పథకం పూర్తిగా కుంటుపడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూపొందించిన నూతన మార్గదర్శకాలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్నాయి. వచ్చే ఖరీఫ్‌కు అర్హులైన రైతులు తమ భూమి వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు.

అధ్వానంగా దత్తాత్రేయ స్వామి ఆలయ రోడ్డు

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మొగిలిచెర్ల సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నది. మొగిలిచెర్ల నుంచి 3కిలోమీటర్ల దూరం ఉన్న ఆలయం రోడ్డు నాలుగు ఫర్లాంగుల దూరం వరకు మట్టి రోడ్డు ఉంది. మిగిలిన రోడ్డు తారు రోడ్డు. మట్టి రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడి రోడ్డు మార్జిన్లు ఇరువైపులా ఆక్రమణలకు గురవడంతో రోడ్డు కుదించుకొని పోయింది. వానాకాలంలో ఈ మట్టి రోడ్డు కాస్తా బురదమయంగా మారి వాహనాలు రాకపోకలకు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రతి శనివారం భక్తులు ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. అంతేగాక మాలకొండ ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఈ ఆలయానికి వచ్చి దైవ దర్శనం చేసుకొంటారు. రెండు రోజుల పాటు ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.

ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య..



లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ సమస్యతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7గంటల వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా లింగసముద్రం డా.కృష్ణమోహన్ ప్రజా వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా మీ సేవా కేంద్రం వరకు ఈ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఈ ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డు మార్జిన్లను పలువురు ఆక్రమించి, మార్జిన్లపై ఎత్తుగా మట్టి వేయడంతో రోడ్డు కుదించుకొని పోయింది. ఎదురెదురుగా వచ్చే బస్సులు, లారీలు ఇతర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని పోతున్నాయి. ఇటీవల కాలంలో పరిమితికి మించి అధిక లోడుతో చిల్లకర్ర, జామాయిల్ కర్రతో వెలుతున్న లారీలు, ట్రాక్టర్లతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు ద్విచక్ర వాహనాలు కూడా రోడ్డుకు ఇరువైపులా నిలిపివేస్తున్నారు. అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల్లో బెల్టు తీసేదెవరు!?

- మండలంలో 3 మద్యం దుకాణాలు.. 150 బెల్టు షాపులు
- నియంత్రణకు అధికారుల మీనమేషాలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం

వలేటివారిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా, ఎవరైనా ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదు. బెల్టు షాపులు వ్యవహారంలో కలుగజేసుకుంటే బెల్టు తీస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నా ఆయన మాటలు స్థానిక ఎక్సైజ్ అధికారులకు చెవి కెక్కడం లేదు. మండలంలో 3 దుకాణాలుంటే 150కి పైగానే బెల్టు షాపులు వెలిశాయి. బెల్టుషాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు మీమేషాలు లెక్కిస్తున్నారన్నది స్పష్ట అవుతోంది.

● అధికార పార్టీ నేతల కనుసన్నలోనే..

బెల్టు షాపులు అధికార పార్టీ నేతల కను సన్నలోనే నడుస్తున్నాయి. బెల్టుషాపు నిర్వాహకులకు మద్యం దుకాణాల యజమానులు మద్యం బాటిల్‌పై ఉన్న ఎంఆర్‌పీ రేటు కంటే అదనంగా రూ.10తీసుకుంటున్నారు. వీరు మద్యం దుకాణాల వద్దకు రాలేని వారికి బెల్టుషాపుల నిర్వాహకులు ఎంఆర్‌పీ కంటే అదనంగా రూ.50లకు మందుబాబులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నేతల ప్రోత్సాహంతోనే బెల్టు షాపుల నిర్వాహణ కొనసాగుతుందని విమర్శలు లేకపోలేదు.

● అనధికారిక సిట్టింగ్‌లు

మద్యం దుకాణం పక్కనే అనధికారిక సిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకొని అక్కడే మద్యం తాగేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సిట్టింగ్‌లకు అనుమతులు లేకపోయినా అనధికారికంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మనల్ని ఎవరూ అడ్డుకుంటారనే ధీమా దుకాణదారుల్లో ఉం డడంతోనే నిర్వహిస్తున్నారనే విమర్శలు లేక పోలేదు. వలేటివారిపాలెంలోని మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ వేసి మద్యం తాగేస్తున్నారు.

● మామూళ్ల మత్తులో అధికారులు

మద్యం దుకాణం పక్కనే సిటింగ్ ఏర్పాటు చేసుకొని మద్యం తాగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు చూసి కూడా మిన్నకుండిపోవడంతో విమర్శలు వ్యక్త మవుతున్నాయి. బెల్టుషాపులను నివారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. అంతేగాకుండా బెల్టుషాపులను ఎక్సైజ్ అధికారులే ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు లేక పోలేదు.

పసుపు, కుంకుమ పుచ్చకాయలు



పుచ్చకాయలు... వేసవి కాలం వచ్చిందంటే చాలు వీటికున్న ఆదరణ అంతా ఇంతా కాదు. నీటిశాతం ఎక్కువగా ఉన్న ఈ కాయలను తింటే శారీరానికి చలువ చేయడంతోపాటు ఆరోగ్యానికీ ఎంతో మంచిదని నిపుణులు చెబుతున్నారు. అందుకేనేమో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. అయితే, ఇప్పటివరకు మనం పచ్చని చారలు, నల్లగా ఉండే పుచ్చకాయలనే చూశాము. అయితే మార్కెట్‌లో పసుపు రంగులో ఉన్న పుచ్చకాయలూ దర్శనమిస్తున్నాయి. అలాగే నల్లగా ఉన్న పుచ్చకాయ లోపల ఎరుపు రంగులో కాకుండా పసుపు రంగులో గుజ్జు ఉన్న కాయలూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి కొంతమంది వ్యాపారులు నగరానికి దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణ కాయలు కిలో రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తుండగా వీటి ధర మరో రూ.5 అధికంగా ఉంటోంది. అయితనేం... నగర వాసులు మాత్రం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నగరంలోని మినీబైపాస్, మద్రాసు బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతం, పొదలకూరు రోడ్డు ఇలా అన్ని ప్రధాన కూడళ్లలో రంగురంగుల పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. ఇంకేందుకు ఆలస్యం మీరు కూడా ఆ రంగుల పుచ్చకాయల రుచి ఏమిటో ఓసారి చూసేయండి...

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

చంద్రమౌళికి పున్నమి పూజ



పున్నమి వేళ నిండు జాబిలి, పండు వెన్నెల ఎవరికైనా ఆహ్లాదాన్నిస్తుంది. నెల్లూరు నగరం కూరగాయల మర్కెట్ ముందున్న సాయి బాబా మందిరంపైన దర్శనమిచ్చే పరమేశ్వరుడికి పౌర్ణమి చంద్రుడు పూజ చేస్తున్న ట్లున్న ఈ దృశ్యం శుక్రవారం ఆంధ్రజ్యోతి కెమెరా కంట పడింది.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

జనషోన



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



పవన్ అభిమానం



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..



వీఆర్సీ మైదానంలో రంగులకు చల్లుకుంటున్న యువత



సంబరంగా హోలీ!

ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం హోలీ సంబరం అంబరాన్ని తాకింది. పిల్లలు, యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగరంలోని వీఆర్సీ మైదానం, మండపాల వీధి తదితర ప్రాంతాల్లో యువతీ యువకులు రంగులు చల్లుకున్నారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్ష్మీదేవికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం కనుల పండువగా పల్లకీ సేవలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా చండీ హోమాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

రౌడీషీటర్ దారుణ హత్య

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర ప్రజలు మరో సారి ఉలిక్కిపడ్డారు. నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఉడ్‌హౌస్ సంఘంలో ఇటీవల జరిగిన దారుణ హత్యను ఇప్పుడిప్పుడే మరిచిపోతున్న నగరవాసులకు వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన దారుణ హత్య భయభ్రాంతులకు గురిచేసింది. రౌడీషీటర్ చింటూ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. పాత వేదాయపాళేనికి చెందిన ఏ సుజన్ కృష్ణ అలియాస్ చింటూ(24) పలు హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితుడు. అతనిపై వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కొంతకాలంగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న చింటూ శుక్రవారం రాత్రి పొదలకూరురోడ్డు జడ్పీ హైస్కూల్ సమీపంలోని ఇందిరాగాంధీ నగర్ రెండో వీధికి వచ్చాడు. ఈ క్రమంలోనే గుర్తుతెలియని కొందరు యువకులు కత్తులతో దారుణంగా నరికి హత్య చేసి పరారయ్యారు. విచక్షణా రహితంగా తల నుంచి కింద వరకు నరకడంతో చింటూ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రాంతం రక్తపు మడుగయ్యింది. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

గవర్నర్‌ను కలిసిన వీఎస్‌యూ వీసీ

- వర్సిటీ అభివృద్ధిపై ఉన్నత విద్య మండలి చైర్మన్‌తో చర్చ



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను గురువారం సాయంత్రం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ (వీసీ) ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, సత్కరించారు. అనంతరం ఏపీ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తిని కూడా మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనలకు ప్రోత్సాహం, విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధి, వర్సిటీ పరిపాలనలో పారదర్శకత, విద్యార్థులకు మెరుగైన అవకాశాలను అందించేందుకు చేపట్టాల్సిన అంశాలతో పాటు ఇతర ముఖ్యాంశాలపై చర్చించారు. వీఎస్‌యూ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇస్తూ, నూతన విద్యా విధానాల అమలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, పరిశోధన వ్యాప్తికి అవసరమైన చర్యలపై సూచనలు అందజేశారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత కూడా ఉన్నారు.

ప్రసన్నుడి ఆలయ అభివృద్ధికి సహకారం: మంత్రి ఆనం



బిట్రగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ రూ.12.50 కోట్లతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వాటికి టెండర్లు పూర్తయి పనులు మొదలవుతున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపం, ఈవో కార్యాలయం, విశ్రాంతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ 2028 నాటికి ఆలయంలో శాశ్వతంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.1.85 కోట్లతో ఆలయానికి ప్రహరీ, రూ.2.65 కోట్ల టీటీడీ నిధులతో గాలిగోపురం నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఈవో రాధాకృష్ణ, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు 30 శాతం ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. నగరంలోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిర్వహించిన ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 117ను రద్దు చేయడమే కాకుండా ఉపాధ్యాయ బదిలీల కోసం విధివిధానాలను రూపొందిస్తోందని చెప్పారు. నూతన విద్యావిధానం ప్రకారం పాఠశాలల పునర్నిర్మాణం, ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులను విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తిచేయాలనుకోవడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం మరింత చొరవ చూపి ఉపాధ్యాయులు ఆర్థిక ప్రయోజనాలపై కూడా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు కే రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి పీ అనిల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి మణికందకాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, రాము, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	103
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 103,500
వెండి ఒక గ్రాము	రూ.106.50